# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 121 | హైదరాబాద్ | గురువారం 30-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

రఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము...
అంబాలా ఎయిర్‌బేస్‌లో గగన విహారం

# స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ భారీ మోసం..

గవర్నమెంట్ అప్రూవల్ ప్లాట్స్.. అత్యధిక రిటర్న్స్.. మీ పెట్టుబడికి మా హామీ.. జీవితంలో స్థిరపడండి.. మీకంటూ ఒక ఆస్థిని సంపాదించుకోండి .. ఇలాంటి కల్లబొల్లి మాటలు చెప్పారు.. ఏజెంట్లను నియమించుకుని, ఆ ఏజెంట్లకు ఖరీదైన బహుమతులు ఇస్తూ.. ప్రచార ఆర్భాటాలు చేస్తూ.. అమాయకులకు గాలం వేసి నిలువునా ముంచేశారు.. గడచిన మూడేండ్ల నుంచి ఈ దోపిడీ పర్వం కొనసాగుతోంది.. కోట్లు దండుకున్నాక చేతులెత్తేశారు.. తాము మోసపోయామని తెలుసుకున్న బాధితులు లబోదిబో మంటూ రోడ్డుకెక్కారు.. కార్యాలయం ముందు ఆందోళనలు చేపట్టారు.. కానీ ఫలితం ఏమీ లేకపోయింది.. ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాధుడు లేకపోయారు.. తమ జీవితాలు నాశనం అయ్యాయని.. ఇక తమకు మరణమే శరణ్యం అంటున్నారు బాధితులు.. వీరందరినీ నట్టేట ముంచిన సంస్థ స్పెక్ట్రా..



12లో

- వందల కుటుంబాల కష్టార్జితాన్ని దోచుకున్న దొంగలు
- మూడేళ్ళ క్రితం కంపెనీకి డబ్బులు చెల్లించిన బాధితులు
- వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన స్పెక్ట్రా
- ప్లాట్లకు సంబంధించిన పత్రాలు ఇవ్వలేదు
- రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్న యాజమాన్యం
- బాధితులు ఎన్ని ఆందోళనలు చేసినా ఫలితం లేదు
- పుస్తెలతాళ్లు సైతం కొడవపెట్టి ప్లేటుల కొనుగోలు
- ప్లాట్లు ఇవ్వకుండా, కట్టిన డబ్బులు ఇవ్వకుండా తిప్పుతున్న యాజమాన్యం
- బాధితుల్లో అధికంగా పేదలు, మధ్యతరగతి వాళ్ళే
- హెచ్.ఎం.డీ.ఏ. అప్రూవల్ ప్లాట్స్ అంటూ నమ్మించి మోసం
- పెద్ద ఎత్తున ఏజంట్లను నియమించుకుని అమాయకులకు వల
- భారీ రిటర్న్స్ వస్తాయని నమ్మబలికిన స్పెక్ట్రా
- ప్రభుత్వం కలుగజేసుకోవాలంటున్న బాధితులు
- బాధితుల తరపున పోరాటానికి సిద్ధమైన " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

## నేటి భారతం

- కలల ఇల్లు కోసం డబ్బు పెట్టిన ప్రజలు..
  ఇప్పుడు న్యాయం కోసం నడుస్తున్నారు.
- మోసగాళ్లు భూమి అమ్మరు, మన కలలు దోచుకుంటారు.
- నమ్మకం మీద కట్టిన ఇల్లు బలమైనది కాదు..
  చట్టం మీద కట్టిన ఇల్లు మాత్రమే నిలుస్తుంది.
- కనీస పరిశీలన చేయకపోతే, గరిష్ట నష్టం మీకే.
- ప్రజల నమ్మకాన్ని అమ్మే వాళ్లు, భూమి మోసగాళ్లు కాదు వాళ్ళు దేశ ద్రోహులు.

– ఇంద్ర పల్లి గోవర్ధన్

## అజారుద్దీన్‌కు మంత్రి పదవి..
## ఎల్లుండి ప్రమాణ స్వీకారం?

- మంత్రి వర్గ విస్తరణకు అధిష్ఠానం నుంచి అనుమతి!
- ఎమ్మెల్సీగా నామినేట్ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- ఇంకా ఆమోదం తెలపని గవర్నర్
- అయినప్పటికీ మంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఏఐసీసీ ఆమోదం!



11లో




## తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం..

11లో

- హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అతి భారీ వర్షా లు
- ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- కుండపోత వర్షా ల కారణంగా పలు ప్రాంతాల మధ్య నిలిచిన రాకపోకలు





11లో

## నల్లగొండ జిల్లాలో ఉగ్రరూపం దాల్చిన మూసీ..
## రాకపోకల బంద్

- భారీ వర్షా లతో ఉప్పొంగుతున్న మూసీ నది
- నిండుకుండలా మారిన మూసీ ప్రాజెక్టు
- ఏడు గేట్లు ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటి విడుదల
- దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు
- జూలూరు-రుద్రవెల్లి వద్ద బ్రిడ్జిపై వరద ప్రవాహం
- పోచంపల్లి-బీబీనగర్ మధ్య నిలిచిపోయిన రాకపోకలు

## మొంథా తుఫాను ప్రభావం..
## అధికారులకు సీఎం ఆదేశాలు

- రైతులకు నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన
- మొంథా ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్న సీఎం
- ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై హైడ్రా, జీహెచ్‌ఎంసీ వెంటనే స్పందించాలన్న ముఖ్యమంత్రి



11లో



## పట్టాలపైకి చేరిన వరద..

మొంథా తుపాన్ కారణంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షా లు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ వర్షం కురుస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో భారీ వర్షా నికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రైలు పట్టాలపైకి వరద నీరు చేరింది. డోర్నకల్ స్టేషన్ లో వరద నీరు పట్టాలను ముంచెత్తింది. దీంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ లను భద్రతా కారణాలరీత్యా రైల్వే అధికారులు నిలిపివేశారు.

# సంపాదకీయం

## మోడీ హత్యకు కుట్ర జరిగిందా

అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రధానమంత్రిగా ఉన్నారు నరేంద్ర మోడీ. అంతేకాదు అమెరికా లాంటి దేశాలను సైతం సవాల్ చేస్తూ ముందుకు దూసుకెళ్తున్నారు. స్నేహాన్ని ఇతర దేశాలతో కొనసాగిస్తూనే.. అవసరమైన సందర్భాల్లో భారత సైనిక సత్తాను ఇతర దేశాలకు అర్థమయ్యేలా చెబుతున్నారు. రక్షణ రంగంలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో.. వైద్యరంగంలో అనేకమార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఒకరకంగా ఆధునిక భారత్ ను నిర్మిస్తున్నారు నరేంద్ర మోడీ. అమెరికా నుంచి మొదలు పెడితే ఆఫ్రికా వరకు భారతదేశంతో గతంలో ఉన్న దానికంటే గొప్పగా దౌత్య సంబంధాలను మెరుగుపరిచారు.అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత.. భారత్ మీద లేని విషాన్ని కక్కుతున్నారు. అనవసరమైన ఆంక్షలు విధిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఈ క్రమంలో భారత్ తన స్వీయ సాధికారతను సాధించుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే అన్ని దేశాలతో వ్యాపార భాగస్వామ్యాలను మెరుగుపరుచుకుంటున్నది. ఎగుమతుల విషయంలో స్పష్టమైన వైఖరిని అవలంబిస్తున్నది. ఇది సహజంగానే అమెరికాకు కంటగింపుగా మారింది. అందువల్లే అమెరికా లేనిపోని కుట్రలను భారత ప్రధాని మీద చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో చైనా లో షాంగై సదస్సుకు ప్రధానమంత్రి వెళితే.. ఓ గుర్తుతెలియని వ్యక్తి హత్యకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. అయితే దానిని రష్యా, చైనా వ్యూహాత్మకంగా తిప్పి కొట్టాయని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మోడీపై హత్యకు ప్రయత్నించిన ఆ వ్యక్తి బంగ్లాదేశ్లో అత్యంత అనుమానాస్పదంగా చనిపోయాడు. అతని వద్ద భారీగా నగదు లభ్యమైంది.వాస్తవానికి ఈ విషయాన్ని నరేంద్ర మోడీ నేరుగా చెప్పలేదు. ఈ విషయాన్ని బయట పెట్టడంలో ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. సద్దాం హుస్సేన్ లేదా గడాఫీ లాగా అమెరికాపై విమర్శలు చేయలేదు. కేవలం పత్రికల ద్వారానే ఈ వార్తను లీక్ చేయించారు. హత్యాయత్నం జరిగిన మాట వాస్తవం. అయితే రష్యా ప్రయత్నం వల్ల ఇది ఆగిపోయిందని ప్రజలకు తెలిసే మాదిరిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేశారు.మనదేశంలో 1966, 1984 తర్వాత ప్రధానమంత్రి పై జరిగిన మూడవ హత్యాయత్నం.. ఒకవేళ నరేంద్ర మోడీని చంపడం లేదా తొలగించేందుకు ప్రయత్నాలు గనుక జరిగితే.. దీనికి గనక ప్రతిపక్షం సహాయం చేస్తోందని కేంద్రం కనుక ప్రకటిస్తే.. ఆ తర్వాతి పరిణామాలు అత్యంత దారుణంగా ఉంటాయి. ఒకవేళ గనుక రాహుల్ గాంధీ బడాయి మాటలు మాట్లాడి.. నరేంద్ర మోడీపై దాడి జరిగితే.. ఆ సమయంలో రాహుల్ గాంధీ ద్వేషాన్ని గనక వ్యాప్తి చేస్తే.. అప్పుడు జరిగే పరిణామాల వల్ల కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా ఇబ్బంది పడతారు..రాహుల్ గాంధీకి రక్షణ ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ కార్యకర్తలు బిజెపి, ప్రజల ఆగ్రహానికి ఖచ్చితంగా గురవుతారు. ఇది కాంగ్రెస్ పార్టీని పెనం నుంచి పొయ్యిలోకి లాగే ప్రయత్నం లాంటిదే.. అయితే ఈ కుట్ర వెనుక రాహుల్ గాంధీ పేరు వినిపించడం లేదు. ఇటీవల అమెరికాకు రాహుల్ గాంధీ వెళ్లారు. ఆయన కొంతమంది వ్యక్తులను కలిశారు. అయితే ఆ వ్యక్తులను అక్కడి డీప్ స్టేట్ కూడా ఇష్టపడకపోవడం విశేషం. అమెరికాలో కూడా రాహుల్ గాంధీకి విశ్వసనీయత లేకపోవడం అత్యంత బాధాకరం. ఇక అమెరికా కూడా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. హమీద్ కర్జాయ్, మహమ్మద్ యూసఫ్ లాంటి వ్యక్తులను మాత్రమే గద్దెనెక్కించింది. దీనిని బట్టి అమెరికా ప్రణాళిక ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ మన దేశ ప్రజలు ఇలాంటి ఉద్రిక్తతలో సమయమనం పాటించాలి. పుతిన్–మోదీ భేటీ జరిగిన ఆగస్టు 31వ తేదీనే, బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఓ హోటల్లో టెర్రెన్స్ జాన్సన్ అనే ఉన్నత స్థాయి అమెరికన్ అధికారి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఇతను అమెరికన్ ఆర్మీలో 20 ఏళ్ల అనుభవం ఉన్న, 'స్పెషల్ ఆపరేషన్స్ ఆఫ్ ఆసియా' విభాగానికి చెందిన కీలక వ్యక్తి అని సమాచారం. మోదీపై కుట్రను అమలు చేసే ఆపరేషన్ కోసమే టెర్రెన్స్ జాన్సన్ కొద్ది నెలలుగా ఢాకాలో మకాం వేశాడని, అక్కడి నుంచి కొందరు తీవ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు సిద్ధం చేశాడని ఈ విశ్లేషణలు ఆరోపిస్తున్నాయి. అయితే ఎలాంటి పోస్ట్‌మార్టం నిర్వహించకుండా, ఈ మరణాన్ని 'సహజ మరణం'గా చిత్రీకరించి, అమెరికా అధికారులు అతని మృతదేహాన్ని హడావుడిగా తరలించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుతిన్ నుండి అందిన పక్కా సమాచారంతో భారత 'రా' లేదా రష్యా ఇంటెలిజెన్స్ ఏజెంట్లు రంగంలోకి దిగి, అసలు కుట్ర అమలు కాకముందే ఢాకాలోని అమెరికన్ అధికారిని 'ఎలిమినేట్' చేసి ఉండవచ్చని గట్టిగా ప్రచారం జరుగుతోంది. సమ్మిట్ ముగించుకుని భారత్ వచ్చిన తర్వాత, ప్రధాని మోదీ తీవ్రవాదంపై మాట్లాడుతూ.. "కొన్ని దేశాలు తీవ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయి. వారే అసలైన తీవ్రవాదులు" అని వ్యాఖ్యానించడం ఈ సంఘటనలకు బలం చేకూరుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన తర్వాతే ప్రధాని మోదీ, డొనాల్డ్ ట్రంప్‌తో భేటీని కూడా రద్దు చేసుకున్నారని గుర్తుచేస్తున్నారు. అయితే ఈ సంచలనాత్మక కథనాలను భారత్, రష్యా, అమెరికా, బంగ్లాదేశ్ ప్రభుత్వాలు అధికారికంగా ధృవీకరించలేదు. ఇవి కేవలం వెరిఫైడ్ సోర్సులు లేని జియో–పొలిటికల్ థియరీలు మాత్రమేనని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుదేశంలో అరాచకం సృష్టించకుండా ఉండాలి.. ఇప్పుడు ఇక చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ తన వ్యతిరేకుల మీద యుద్ధాన్ని మొదలుపెట్టాడు. ఏకంగా చంపడాన్ని కూడా ప్రారంభించాడు. తనపై హత్యాయత్నం జరిగిన తర్వాత.. దానికి పాల్పడిన వ్యక్తి బంగ్లాదేశ్లో అత్యంత అవమానకరంగా చనిపోయాడు. ఈ ప్రకారం నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న వారికి ఎటువంటి ట్రీట్మెంట్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటా.

# ఏపీలో ఆల్ ఇన్ వన్ యాప్




ఒంగోలు, అక్టోబరు 29,
విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా బిల్లు చెల్లింపులు, కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవడం సులభం కానుంది. అంతేకాకుండా.. ఇంట్లో ఉండే ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఎంత కరెంటు ఉపయోగిస్తున్నాయో ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులతో నేరుగా సంప్రదించే అవకాశం ఈ యాప్ ద్వారా కల్పించారు. కాగా ఇటీవల, విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ అధికారులను హెచ్చరించారు.విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త సాంకేతికతను ఉపయోగిస్తోంది. వినియోగదారుల సమస్యలను మరింత వేగంగా, సమర్థంగా పరిష్కరించడానికి ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో ప్రత్యేక ఫీచర్లు అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో.. ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలిస్తారు. అనంతరం వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తారుయాప్ ద్వారా విద్యుత్ బిల్లులు సులభంగా చెల్లించొచ్చు. బిల్‌పే అనే ఆప్షన్ ద్వారా సర్వీసు నంబరు, మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే.. వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు ప్రత్యక్షమవుతాయి. అనంతరం పేమెంట్ చేయాల్సి ఉంటుంది. ఇక కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం అప్లికేషన్ కూడా చేసుకోవచ్చు. అందుకోసం అన్ని వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును అధికారులు పరిశీలించి కొత్త కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు. కాగా, ఇంట్లో ఏయే ఎలక్ట్రానిక్ పరికరాలు ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నాయో.. ఈ యాప్‌లో ఉన్న ఎనర్జీ కాలిక్యులేటర్ ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు మీటరు రీడింగ్ వివరాలు ఎంటర్ చేస్తే.. ఆ సమాచారం కనిపిస్తుంది. అంతేకాకుండా, కరెంట్ ఆదా చేయడానికి కూడా ఈ యాప్‌లో సలహాలు, సూచనలు ఉంటాయి. విద్యుత్ అధికారుతో కూడా నేరుగా మాట్లాడి సమస్యలు తెలిపే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది.సూపర్ యాప్ ద్వారా కస్టమర్ సేవలు కూడా అందిస్తోంది ఏపీఎస్పీడీసీఎల్. వినియోగదారులు తమ సమస్యలను ఈ యాప్‌లో పొందుపరచొచ్చు. విద్యుత్తు శాఖ అందిస్తున్న సేవలపై ఫీడ్‌బ్యాక్ కూడా ఇవ్వొచ్చు.

సంతృప్తి లేదా అసంతృప్తి తెలియ జేయొచ్చు. వినియోగదారుల పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు ఈ యాప్‌లో ఉంటాయి. వారికి ఫోన్ చేసి సందేహాలు అడిగి తెలుసుకోవచ్చు. అంతేకాకుండా వినియోగదారులకు సంబంధించిన టారిఫ్ వివరాలు కూడా యాప్‌లో ఉంటాయి. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలను అందించాలని ఇటీవల ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అక్టోబర్ 22న ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 9 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో నిర్వహించారు. వినియోగదారుల మన్ననలు పొందేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సంస్థ పరిధిలోని 410 సెక్షన్లలో వినియోగదారులకు అందుబాటులో ఉంటూ నిరంతర విద్యుత్ సరఫరా, లో ఓల్టేజ్ సమస్య లేకుండా చేయడానికి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని శివ శంకర్ వార్నింగ్ ఇచ్చారు.

# సొంత జిల్లాపై ఫుల్ ఫోకస్

తిరుపతి, అక్టోబరు29,
మ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయాయి. అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా, స్థానిక నాయకత్వం కొరవడడం, ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం పార్టీ క్యాడర్‌ను కలవరానికి గురిచేస్తోంది. తంబళ్లపల్లి, తిరుపతి, సత్యవేడు, పుంగనూరు? ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఇన్‌ఛార్జ్‌ల పనితీరుపై క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉందట. అధికారం ఉన్నా తమను తాము రక్షించుకోలేని స్థితిలో ఉన్నామంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు అధినేత చంద్రబాబు ఏ మేరకు కఠిన నిర్ణయాలు తీసుకుంటారనే దానిపైనే ఉమ్మడి చిత్తూరు భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఇన్‌ఛార్జ్‌ల నియామకం, పనితీరపై అసంతృప్తి:. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో తీవ్రమైన నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇన్‌ఛార్జ్‌ల నియామకం, వారి పనితీరుపై పార్టీ క్యాడర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నదట. నాలుగు కీలక నియోజకవర్గాల్లో పరిస్థితి 'చుక్కాని లేని నావ' వలె మారిందట. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం, ఇతర పార్టీల నుంచి అరువు తెచ్చుకున్న నేతలకు కీలక పదవులు ఇవ్వడం, వారు లోకల్ నాయకులను విస్మరించి, తమ సొంత కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడమేనని క్యాడర్ ఆరోపిస్తోంది. శంకర్ యాదవ్, దొరస్వామి నాయుడు ప్రయత్నాలు:. తంబళ్లపల్లి నియోజకవర్గంలో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరి టికెట్ పొందిన జయచంద్రారెడ్డి ఇటీవలే నకిలీ మద్యం వ్యవహారంలో చిక్కుకోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆయన పార్టీలో చేరిన సమయంలోనే స్థానిక క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకించినా, కడప జిల్లాకు చెందిన కొందరు నేతల సహకారంతో టికెట్ సంపాదించారట. గత 16 నెలలుగా ఆయన పార్టీ శ్రేణులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ నియామకం కంటే, సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానిక క్యాడర్ పట్టుబడుతోందట. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి తిరిగి వస్తారని ప్రచారం జరుగుతున్నా, గతంలో ఆయన చంద్రబాబుపై చేసిన విమర్శల కారణంగా టీడీపీ కార్యకర్తలు అంతగా ఇంట్రెస్ట్ చూపట్లేదట. మరోవైపు, శంకర్ యాదవ్, తెలుగు యువత నాయకుడు కట్టా దొరస్వామి నాయుడు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తుండగా, క్యాడర్ మాత్రం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని కోరుకుంటోందట. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్:. తిరుపతి నియోజకవర్గంలో కూడా ఇదే విధమైన నాయకత్వ శూన్యత నెలకొని ఉందట. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నప్పటికీ, ఆమెకు సహకరించే నాయకత్వం లేకపోవడంతో ఆమె ప్రయత్నాలు ఫలించడం లేదు. చాలామంది నాయకులు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నించి, ఆశలు వదులుకుని సైలెంట్ అయ్యారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ఉండటం, అధిక సంఖ్యలో వైసీపీ నుంచి వచ్చిన కార్పొరేటర్లు జనసేన వైపు మొగ్గు చూపడం పార్టీని బలహీనపరుస్తోంది. దీనికి తోడు, నగర పాలక సంస్థలో అవినీతి, దందాలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు, ఫలితంగా టీడీపీ క్యాడర్ తీవ్రమైన మానసిక క్షోభకు లోనవుతోందట. ఈ పరిస్థితుల దృష్ట్యా, క్యాడర్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోందట. జె.బి. శ్రీనివాస్, మబ్బు నారాయణ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్ లతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తే మూడు బలమైన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించి, పార్టీ బలోపేతం అవుతుందని వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ ఇన్‌ఛార్జ్‌ల నియామకంలో కూడా బలహీనులను పెట్టారనే విమర్శలున్నాయి. సత్యవేడులో కన్వీనర్‌గా శ్రీపతి బాబు తొలగింపు:. సత్యవేడులో పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి వచ్చి, అందరి వ్యతిరేకత మధ్య విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తర్వాత జరిగిన పరిణామాలతో ఇరుక్కుపోయారు. ముఖ్యంగా గ్రావెల్ మాఫియా చేసిన కుట్ర, ఓ మహిళా టీడీపీ నాయకురాలితో ఆయన వీడియో బయటకి రావడం వంటి వాటితో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత శ్రీపతి బాబును కన్వీనర్‌గా నియమించినప్పటికీ, అధిష్టానం ఆయన్ను తొలగించి కాంట్రాక్టర్ శంకర్ రెడ్డిని ప్రోగ్రామ్ కన్వీనర్‌గా నియమించింది.. ఆయనే ఇన్‌ఛార్జ్‌గా చెప్పుకుంటున్నారు. శంకర్ రెడ్డి పార్టీలో చేరిన వెంటనే తన సామాజిక వర్గాన్ని మొత్తం పార్టీలోకి చేర్చి, వారికి అన్ని వ్యవహారాలు అప్పగించడంతో స్థానిక టీడీపీ క్యాడర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తాజాగా, ఓ దేవాలయం ధర్మకర్తల నియామకంలో వివాదస్పద మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శేఖర్ రెడ్డి అనుచరుడికి అవకాశం కల్పించడం, అనేక కేసులు ఉన్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించడం మరింత వివాదాన్ని రేపింది. ఇక్కడ కూడా తంబళ్లపల్లి మాదిరిగానే భవిష్యత్తులో పార్టీకి నష్టం చేకూర్చవచ్చని క్యాడర్ ఆందోళన చెందుతోంది. కోల్డ్ స్టోరేజ్‌లో పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం:. ప్రతిష్టాత్మకమైన పుంగనూరు నియోజకవర్గంలోనూ ఇదే సమస్య తలెత్తింది. ఇన్‌ఛార్జ్ అయిన చల్లా బాబు రెడ్డి చుట్టూ ఉన్న కోటరీతో స్థానిక కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పార్టీ కోసం నష్టపోయిన, జైళ్లకు వెళ్లిన కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోకుండా, ఆయన కోటరీ తమను ఇబ్బంది పెడుతోందని, ముఖ్యంగా వైసీపీలో తమపై దాడులు చేసిన వారికి అండగా నిలుస్తోందని ఆరోపణలు వచ్చాయి. గతంలో రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్త హత్యను కూడా దీనికి నిదర్శనంగా చూపుతున్నారు. అధికారం చేతికి వచ్చినా, కార్యకర్తలు తమ అధికార దర్పం చూపించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని తెలుస్తోంది. పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం కూడా కోల్డ్ స్టోరేజ్‌లో ఉండిపోయింది. మొత్తం మీద, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి మంత్రి ప్రాతినిధ్యం లేకపోవడం, సీనియర్ నాయకులు పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం వంటి పరిస్థితుల్లో, కొత్త ఇన్‌ఛార్జ్‌లు, అధ్యక్షుల నియామకం తర్వాత అయినా తమను పట్టించుకునే వారు ఉంటారని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు

# పొగాకు వద్దంటే వినరే...



గుంటూరు, అక్టోబరు 29,
ప్రభుత్వం వద్దన్నా రైతులు బర్లీ పొగాకు సాగును ఆపడం లేదు. ఖరీఫ్ లో 21 వేల ఎకరాల్లో సాగు చేయగా, అందులో 15 వేల ఎకరాలు బర్లీ పొగాకే. కొనుగోలుదారుల స్పష్టత లేక, ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టినా, సమస్య తీరడం లేదు. రబీలోనూ సాగు పెరిగే అవకాశం ఉంది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం వద్దని చెప్పినా రైతులు వినడం లేదు.. నిషేధించినా సరే వెనక్కు తగ్గడం లేదు. రాష్ట్రంలో రైతులు బర్లీ పొగాకు సాగు ఆగడం లేదు. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 21 వేల ఎకరాల్లో రైతులు ఈ బర్లీ పొగాకు వేశారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 11,400 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 4,600 ఎకరాల్లో, కర్నూలు జిల్లాలో 4,000 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. మొత్తం 21 వేల ఎకరాల్లో, 15 వేల ఎకరాలు బర్లీ పొగాకే. ఎఫ్‌సీవీ (ఫుల్ క్యూర్డ్ వర్జీనియా పొగాకు) రకం కేవలం 6 వేల ఎకరాల్లోనే సాగైంది.. ఏడు జిల్లాల్లో కొద్ది విస్తీర్ణంలో సాగు చేశారు. మొత్తం 21 వేల ఎకరాల్లో.. 6 వేల ఎకరాలు ఫుల్ క్యూర్డ్ వర్జీనియా పొగాకు (ఎఫ్‌సీవీ) రకం కాగా.. మిగిలిన 15 వేల ఎకరాలు బర్లీ పొగాకు. ఈ పొగాకును ఎవరు కొనుగోలు చేస్తారు.. ఎంత ధరకు కొనుగోలు చేస్తారో కూడా క్లారిటీ లేదు.చాలామంది రైతులు మరే పంట వేయాలో తెలియక చాలామంది పొగాకు సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే.. రబీ సీజన్‌లో కూడా బర్లీ పొగాకు సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. అప్పుడు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గతేడాది క్వింటాలుకు రూ.15 వేలు పలికిన బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు ధరలు ఈ ఏడాది గణనీయంగా పడిపోయాయి. వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం, వారిని ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. మార్క్‌ఫెడ్ ద్వారా 19.73 మిలియన్ కిలోల బ్లాక్ బర్లీని కొనుగోలు చేసింది. క్వింటాలుకు రూ.12 వేలు ధర నిర్ణయించినా, చాలా మంది రైతులకు ఆ ధర కూడా దక్కలేదు. కొనుగోలు ప్రక్రియలో ధరలో కోత పడిందని రైతులు చెబుతున్నారు.ప్రైవేట్ వ్యాపారుల ద్వారా మరో 50 మిలియన్ (5 కోట్ల) కిలోల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ, ఇంకా చాలా మంది రైతుల ఇళ్లలో పొగాకు అమ్ముడుపోకుండానే మిగిలిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైట్ బర్లీ సాగు చేసిన రైతులు కూడా ఈ ఏడాది నష్టాలనే ఎదుర్కొన్నారు. గత ఏడాది క్వింటాలుకు రూ.15 వేలు లభించిన ధర, ఈ ఏడాది రూ.12 వేల నుంచి అతికష్టం మీద మాత్రమే రూ.15 వేలకు చేరింది. అంటే ధరలో పెద్దగా పెరుగుదల లేదని, కొందరు రైతులు రూ.12 వేలకే అమ్ముకోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. కర్నూలు, నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వైట్ బర్లీ పొగాకు సాగు ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలలోని రైతులు ఈ ధరల పతనంతో తీవ్రంగా నష్టపోయారు. వ్యాపారులు ముందుకు రాకపోవడం, ప్రభుత్వ కొనుగోళ్లు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఏపీ ప్రభుత్వం హెచ్‌డీ బీఆర్‌జీ, హెచ్‌డీ బర్లీ, బ్లాక్ బర్లీ వంటి పొగాకు రకాల సాగును నియంత్రించింది. ఈ నియంత్రణలో భాగంగా, జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్ల నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశారు.

# పవన్ వ్యూహాత్మక మౌనం

విజయవాడ, అక్టోబరు 29,
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారా? ఒక వ్యూహం ప్రకారం మౌనంగా ఉన్నారా? అదే మేలని భావిస్తున్నారా? ప్రస్తుతానికి సైలెంట్ శ్రేయస్కరం అని చూస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాష్ట్రంలో తాజాగా జరుగుతున్న రాజకీయ పరిణామాలపై పవన్ నోరు తెరవడం లేదు. ఏ అంశంపై స్పందించిన దాఖలాలు లేవు. స్పందిస్తే రాజకీయంగా లాభం కంటే.. నష్టమే అన్న ఆలోచనలో పవన్ ఉన్నారు. అందుకే వ్యూహాత్మకంగా సైలెన్స్ పాటిస్తున్నారు.

నకిలీ మద్యం వ్యవహారంపై పెద్ద దుమారమే నడిచింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో భారీ నకిలీ మద్యం డంప్ వెలుగులోకి వచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిపోతుందని అంతా భావించారు. ఇలా కూటమి ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న తరుణంలో ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్ధన్ రావు సంచలన విషయాలు బయట పెట్టారు. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక మాజీ మంత్రి జోగి రమేష్ ప్రోత్సాహం ఉందని.. వైసిపి హయాంలో తయారు చేశామని ఆయన ఒక ప్రత్యేక వీడియో విడుదల చేయడంతో యూటర్న్ తీసుకుంది. దర్యాప్తులో సైతం వైసీపీ కుట్ర కోణం ఉందని బయటపడినట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసు వ్యవహారంపై పవన్ కళ్యాణ్ మాట్లాడి ఉంటే సంచలనంగా మారే అవకాశం ఉండేది.

మరోవైపు ప్రభుత్వ మెడికల్ కాలేజీల అంశం పైగట్టిగానే పోరాటం చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. వైసిపి హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు నిర్ణయించింది. అయితే ఓ చోట కూడా పూర్తి చేయలేకపోయింది. ఈ తరుణంలో కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్లో సైతం దీనిపై చర్చ జరిగింది. ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అదే క్యాబినెట్లో పవన్ కళ్యాణ్ సైతం ఉన్నారు. అయితే దీనిని ప్రచార అస్త్రంగా మార్చుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల నిర్మాణానికి సంబంధించి ప్రజల నుంచి భిన్న స్పందన వస్తోంది. పాలసీ ప్రకారం ప్రైవేటు భాగస్వామ్యంతో వీలైనంత త్వరగా పనులు పూర్తవుతాయని ఎక్కువమంది భావిస్తున్నారు. అయితే అది ప్రభుత్వ లక్ష్యానికి దెబ్బతీసే విధానమని మరికొందరికి వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలోనే పవన్ ఈ అంశంపై మాట్లాడలేదు.పవన్ కళ్యాణ్ మాట్లాడితే కార్నర్ చేసేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది. అయితే వైసీపీ లేనిపోని ఆరోపణలను నిజనిర్ధారణ చేస్తే మంచి యంత్రాంగాన్ని కూటమి నియమించింది.

# పరకామణి కేసు... రంగంలోకి దిగిన సీఐడీ

తిరుమల, అక్టోబరు 29, (న్యూస్ పల్స్)

తిరుమల.. కోట్లాది మంది హిందువులకు.. అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం. కోరిన కోరికలు నెరవేర్చిన శ్రీనివాసుడికి.. అత్యంత భక్తిశ్రద్ధలతో కానుకలు సమర్పిస్తారు భక్తులు. వాటిని.. టీటీడీ అధికారుల పర్యవేక్షణలో.. పరకామణిలో లెక్కిస్తారు. ఇలాంటి చోట చోరీ జరగడం.. భక్తుల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అంతేకాదు.. ఈ చోరీ కేసుని లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవడం సంచలనంగా మారింది. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరగాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయ్. మొత్తానికి.. మళ్లీ ఇన్నాళ్లకు ఈ కేసులో కదలిక వచ్చింది. ప్రకంపనలు సృష్టించిన పరకామణి వ్యవహారంపై.. సీఐడీ దర్యాప్తునకు ఏపీ హైకోర్టు ఆదేశించింది. చోరీపై నమోదైన కేసుని.. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై న్యాయస్థానం కీలక ఉత్తర్వులు ఇచ్చింది. చోరీకి పాల్పడిన రవికుమార్ ఆస్తులపై దర్యాప్తు చేయాలని ఏసీబీని ఆదేశించింది. కేసు రాజీ వ్యవహారంలో టీటీడీ బోర్డు, అధికారుల పాత్రపై దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. రవికుమార్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు పరిశీలించాలని సూచించింది. ఆస్తులు ఎవరి పేర్ల మీదకైనా బదిలీ చేశారా? అనే అంశంపైనా దర్యాప్తు చేయాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన రిపోర్టుని.. తదుపరి విచారణలోగా అందించాలని సీఐడీ, ఏసీబీని ఆదేశించింది హైకోర్టు. పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపకుండానే రాజీ చేయించారు:. వైసీపీ ప్రభుత్వ హయాంలో.. 2023లో తిరుమల పరకాణిలో చోరీ జరిగింది. దీనిపై.. కేసు నమోదైంది. ఈ ఘటనపై.. అదే ఏడాది టీటీడీ విజిలెన్స్‌కి కూడా ఫిర్యాదు అందింది. ఉద్యోగి రవికుమార్ పెద్దఎత్తున పరకామణిని కొల్లగొట్టారని అందులో తెలిపారు. దీనిపై.. అప్పటి టీటీడీ అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపకుండా.. లోక్ అదాలత్‌లో హడావుడిగా రాజీ చేయించారు. ఈ ఘటనపై.. పిటిషన్ దాఖలు కావడంతో.. హైకోర్టు విచారణకు స్వీకరించింది. పరాకమణిలో భారీగా అక్రమాలు జరిగాయనడానికి.. ఈ ఘటనే ఉదాహరణ అనే వాదనలు కూడా వినిపిస్తున్నాయ్. ఇలా.. పరకామణి చోరీ వ్యవహారం మళ్లీ ప్రకంపనలు రేపుతోంది. తిరుమలలో ఇలాంటి దొంగతనం జరగడం, ఆ కేసుని పక్కదోవ పట్టించడంపై.. భక్తులతో పాటు పౌర సమాజంలోని ప్రముఖులు కూడా తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ఈ ఒక్క ఘటనతో.. కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని చెబుతున్నారు. రవికుమార్ చేతివాటం ఎలా బయటపడింది? తిరుమల పెద్ద జియ్యంగార్ మఠంలో క్లర్క్‌గా పనిచేసే రవికుమార్.. 2023 ఏప్రిల్ 29న ఎప్పటిలాగే పరకామణిలో స్వామివారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలు లెక్కించేందుకు వెళ్లాడు. అక్కడ.. వెంకటేశ్వరస్వామికి కానుకగా వచ్చిన అమెరికన్ డాలర్లలో.. రవికుమార్ 900 డాలర్లు దొంగిలించాడు. వాటిని దాచుకొని బయటకు తీసుకెళ్తుండగా.. టీటీడీ విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్‌కు దొరికిపోయారు. రవికుమార్ దగ్గర్నుంచి 72 వేల విలువైన అమెరికన్ డాలర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీపై.. తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రవికుమార్‌పై.. ంఋూ సతీశ్ కుమార్ ఫిర్యాదు చేశారు. దాని



ఆధారంగా.. అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తర్వాత విచారణలో భాగంగా రవి కుమార్ దగ్గర్నుంచి.. అమెరికన్ డాలర్లను స్వాధీనం చేసుకున్నారు. మే 19న టీటీడీకి తనకు చెందిన 7 ఆస్తులను దానం చేస్తానని ప్రతిపాదించారు. అయితే.. వాటి విలువ కోట్లలో ఉంది. ఆస్తులు దానం చేయాలంటే.. వాటి వివరాలను పత్రికల్లో ప్రచురించి.. ఎవరికీ అభ్యంతరం లేకపోతేనే తీసుకోవాల్సి ఉంటుంది. కానీ.. ప్రకటన ఇచ్చేంత సమయం లేదని, దాని నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరడంతో.. బోర్డు అంగీకారం తెలిపింది. త్వరగా ప్రక్రియ ముగించేందుకు కారణాలు మాత్రం చెప్పలేదు. ఆ ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువే 14 కోట్లు ఉంది. కానీ.. రవికుమార్ దొంగిలించింది కేవలం 70 వేల విలువైన.. అమెరికన్ డాలర్లు మాత్రమే. ఆ తర్వాత విజిలెన్స్ అధికారి సతీశ్, చోరీకి పాల్పడిన రవికుమార్ లోక్అదాలత్‌కు వెళ్లారు. సమస్యని తామే పరిష్కరించుకుంటామని అనుమతి తీసుకున్నారు. అయితే.. పోలీసుల ఒత్తిడితోనే తాను రాజీకి అంగీకరించినట్టు సతీశ్ చెబుతున్నారు. ఎవరి సాయం లేకుండానే రవికుమార్ చోరీ చేశాడా? లోక్ అదాలత్‌లో కాంప్రమైజ్ అయ్యేందుకు సతీశ్ కుమార్‌కి ఎలాంటి అధికారాలు లేవు. లోక్ అదాలత్‌లో కాంప్రమైజ్ అవ్వాలంటే.. నిందితుడు, ప్రాపర్టీ ఓనర్ ఇద్దరూ ఒప్పుకొని తీరాలనే వాదన బలంగా వినిపిస్తోంది. కానీ.. ఇక్కడ ఓనర్ సతీశ్ కాదు. అతను కేవలం విజిలెన్స్ అధికారి మాత్రమే. ఒరిజినల్ ఓనర్.. ఆ వేంకటేశ్వరస్వామియే. అలాంటప్పుడు.. సతీశ్ ఎలా కాంప్రమైజ్ అవుతారనే ప్రశ్నలు వస్తున్నాయి. సతీశ్ కుమార్‌కు కాంప్రమైజ్ చేసే అధికారమే లేదంటున్నారు. అందువల్ల.. ఈ చోరీ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయించాలనే డిమాండ్లు వస్తున్నాయి. 2023 ఏప్రిల్‌లో.. రవికుమార్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌లోనూ సాధారణ దొంగతనంగానే చూపారు. 2023 మే 30న.. ఈ కేసులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. రవికుమార్, ఆయన భార్య.. 2023 జూన్ 13న 7 ఆస్తులను స్వామివారికి దానం ఇచ్చారు. దాదాపు 20 ఏళ్లుగా శ్రీవారి సన్నిధిలో పనిచేస్తున్న వ్యక్తి దొంగతనానికి పాల్పడితే.. నమ్మకద్రోహం కింద కేసు పెట్టాలి కానీ.. ఎఫ్ఐఆర్ చాలా సాధారణంగా ఉందనే వాదన వినిపిస్తోంది. అసలు.. డబ్బు లెక్కించే స్థానంలో లేని రవికుమార్ దగ్గరకి డాలర్ల కట్ట ఎలా వచ్చింది? ఎవరి సాయం లేకుండానే ఇదంతా జరిగిందా? 2023 ఏప్రిల్‌లో దొంగతనం జరిగితే.. సెప్టెంబరు నాటికి ఎలా రాజీ చేశారు? పాలకవర్గం అనుమతి లేకుండా లోక్ అదాలత్‌తో.. ఎలా రాజీకి అనుమతి అడిగారు? అయినా.. వంద కోట్ల ఆస్తులున్న వ్యక్తి.. క్లర్క్‌గా పనిచేయడమేంటి? అనేది కూడా ఇప్పుడు చర్చకు వస్తోంది. పరకామణిలో చోరీ కేసును కదిలిస్తే.. లెక్కలేనన్ని డౌట్స్ వస్తున్నాయ్. స్వామివారి కానుకని దొంగిలించిన వ్యక్తితో.. రాజీ కుదర్చడమేంటి? నష్టపరిహారం కింద.. ఆస్తుల్ని రాసివ్వమనడమేంటి? చోరీ చేసిన వ్యక్తికి.. సరైన శిక్ష పడకుండా కేసు నుంచి తప్పించడమేంటి? ఇలా.. ఎన్నో సందేహాలున్నాయ్? అప్పట్లో.. కొందరు రాజకీయ పెద్దలు.. రవి కుమార్ కేసుల పాలవకుండా రక్షించారనేదే ఆరోపణలు కూడా ఉన్నాయ్. ఇలాంటి ఘటనలతో.. తిరుమలపై భక్తుల నమ్మకం సన్నగిల్లకుండా.. టీటీడీ ఎలాంటి చర్యలు చేపట్టాలి? హుండీ నుంచి ఎంత డబ్బు మాయమైందనే దానిపై దర్యాప్తు:. పరకామణిలో చోరీ వ్యవహారం సృష్టించిన ప్రకంపనలు అంతా ఇంతా కాదు. తిరుమల లాంటి గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంలోనే ఇలాంటి దొంగతనం జరిగితే.. మిగతా ఆలయాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయనే ప్రశ్న తలెత్తుతోంది. హుండీ కానుకల లెక్కింపులో.. అన్ని రకాల పర్యవేక్షణ ఉండగా కూడా.. ఇలాంటి దొంగతనం ఎలా చేయగలిగారనేదే మేజర్ డౌట్. ఎందుకంటే.. తిరుమల శ్రీనివాసుడికి ప్రతిరోజూ భారీ ఎత్తున విరాళాలు వస్తుంటాయ్. అందులో.. ఇంకెన్ని అక్రమాలు జరుగుతున్నాయనే సందేహం తలెత్తుతోంది. అయినప్పటికీ.. రవికుమార్ ఈ దొంగతనం ఎలా చేయగలిగారు? ఎవరో సహకరిస్తేనే.. దొంగతనం చేశారనే అనుమానం బలపడుతోంది. దీని వెనక ఎవరున్నారు? స్వామివారి హుండీ నుంచి మొత్తం ఎంత డబ్బు మాయమైందనే దానిపైనా దర్యాప్తు జరగాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయ్. పరకామణి చోరీ వ్యవహారం పై పెద్ద కథే ఉందంటున్నారు:. పరకామణిలో చోరీ వ్యవహారం కేవలం.. 72 వేల విలువ చేసే డాలర్లకు సంబంధించింది కానే కాదు. దీని వెనుక.. చాలా పెద్ద కథే ఉందంటున్నారు. రవికుమార్ కొన్నేళ్లుగా పరకామణి నుంచి డాలర్లు దొంగిలిస్తున్నాడనే ఆరోపణలున్నాయ్. అతనికి మిగతా వాళ్లలా తనిఖీలు ఉండకపోవడం.. కలిసొచ్చింది. అలా.. డాలర్లను మార్చి.. కోట్లు వెనకేసినట్లు తెలుస్తోంది. కేవలం 72 వేల విలువైన అమెరికన్ డాలర్ల కోసమైతే.. తన ఆస్తుల్ని టీటీడీకి రాసివ్వడు. కేసును ఎదుర్కొంటాడు. బెయిల్ కూడా త్వరగానే వచ్చేస్తుంది. అయినప్పటికీ.. కోట్లు విలువ చేసే ఆస్తుల్ని రాసిచ్చేశాడంటే.. కచ్చితంగా లోపాయికారిగా కొందరు పెద్దలకు డబ్బులు, ఆస్తులు ముట్టజెప్పాడనే ప్రచారం జరుగుతోంది. చోరీకి పాల్పడిన వ్యక్తి ఆస్తుల్ని.. టీటీడీకి రాయించేశాం కాబట్టి.. అతని మీద కేసులవీ వద్దని.. లోక్ అదాలత్‌లో రాజీ చేశారు. అసలు.. ఓ నిందితుడు విరాళం ఇస్తే అప్పటి టీటీడీ పెద్దలు ఎలా తీసుకున్నారు? శ్రీనివాసుడి పరకామణిలో కొట్టేసిన విదేశీ కరెన్సీతో సంపాదించిన కోట్లు విలువ చేసే ఆస్తుల్ని.. మళ్లీ శ్రీవారికే విరాళం ఇవ్వడమేంటి? టీటీడీ విజిలెన్స్ అధికారులపై పోలీసులు ఎందుకు ఒత్తిడి తెచ్చారు? ఈ వ్యవహారాన్ని వెనకుండి నడిపించిందెవరు? అయినా.. ఓ దొంగతనం కేసులో నష్టపరిహారం కట్టించడమేంటి? పోలీసులు కూడా బలహీనమైన సెక్షన్లు ఎందుకు పెట్టాల్సి వచ్చింది? ఇవే ప్రశ్నలు.. అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయ్. అధికారుల పాత్రపై దర్యాప్తు చేయాలని హైకోర్టు స్పష్టం:. టీటీడీ ఉద్యోగులు, అధికారులపై భక్తులు ఎంతో నమ్మకం ఉంచుతారు. అలాంటి చోట.. చోరీ జరగడం, లోక్ అదాలత్ ద్వారా కేసు రాజీ కుదర్చడం, పూర్తి స్థాయి విచారణ జరగకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు రావడం.. టీటీడీ నైతికతపై ప్రశ్నల్ని లేవనెత్తుతాయ్. ఇలాంటి ఘటనలు.. ఆలయ నిర్వహణలో పారదర్శకత లోపించిందనే భావనని కలగజేస్తాయ్. పూర్తిగా దైవకార్యానికే అంకితం కావాల్సిన వ్యవస్థలో.. అవకతవకలు జరుగుతున్నాయంటే.. భక్తుల విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఈ కేసులో.. ఏపీ హైకోర్టు సీఐడీ దర్యాప్తునకు ఆదేశించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర క్షేత్రంలో జరిగిన వ్యవహారంలో.. చట్టం తన పని తాను చేస్తుందనే భరోసానిస్తుంది. చోరీకి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడంతో పాటు, కేసుని లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవడంలో.. టీటీడీ బోర్డు సభ్యులు గానీ, అధికారుల పాత్ర గానీ ఏమైనా ఉందా? అనే విషయంపైనా.. దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు.

స్వామి వారి సేవ , హుండీ లెక్కింపులో పాల్గొనే వారికి ట్రైనింగ్:. ముఖ్యంగా.. పరకామణిలో చోరీ ఘటనతో ఒక విషయం మాత్రం క్లియర్‌గా అర్థమవుతోంది. టీటీడీ మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. హుండీ లెక్కింపు ప్రక్రియ, ఉద్యోగుల పర్యవేక్షణ, అంతర్గత విజిలెన్స్ వ్యవస్థని.. మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉంది. అంతేకాదు.. స్వామి వారికి సేవ చేసేవారికి, హుండీ లెక్కింపులో పాల్గొనే వారికి కచ్చితంగా ట్రైనింగ్ ఇవ్వాలనే సూచనలు కూడా చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలని శ్రీనివాసుడి భక్తులు చెబుతున్నారు. స్వామివారి హుండీ డబ్బులు ముట్టుకోవాలంటేనే భయపడే విధంగా.. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్నారు. నేరచరిత్ర ఉన్నవాళ్లెవరూ.. ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఉండకూడదని చెబుతున్నారు. ఏదేమైనా.. భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని.. తిరుమల పవిత్రతని పునరుద్ధరించేందుకు.. సీఐడీ దర్యాప్తు ముఖ్యమైన చర్యగా భావిస్తున్నారు

## రజనీ రిటైర్మెంట్...

చెన్నై, అక్టోబరు 29,)

74 ఏళ్ళ వయస్సు లో కూడా స్టార్ హీరోలతో సరిసమానంగా బాక్స్ ఆఫీస్ రికార్డ్స్ ని పాన్ ఇండియా లెవెల్ లో బద్దలు కొడుతూ ముందుకు దూసుకెళ్తున్న ఏకైక సూపర్ స్టార్ రజినీకాంత్ మాత్రమే. ఇండియా లో ఎంతో మంది సూపర్ స్టార్స్ రావొచ్చు, వెళ్లొచ్చు, కానీ రజినీకాంత్ లాంటి సూపర్ స్టార్ ని భవిష్యత్తులో మరొకరిని చూడలేము. అలాంటి హిస్టరీ ని క్రియేట్ చేసిన రజినీకాంత్ ఫిల్మోగ్రఫీ కి త్వరలోనే ఎండ్ కార్డు పడబోతుందా అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ప్రస్తుతం చేతిలో ఉన్న సినిమాలను పూర్తి చేసి, శాశ్వతంగా సినీ కెరీర్ నుండి తప్పుకొని, హిమాలయాల్లో శేష జీవితాన్ని గడపాలని రజినీకాంత్ నిర్ణయం తీసుకున్నట్టు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ఒక ప్రచారం జరుగుతుంది. ఈ ఏడాది రజినీకాంత్ నుండి 'కూలీ' అనే చిత్రం విడుదలైందిఈ సినిమాకు డివైడ్ టాక్ వచ్చినప్పటికీ కూడా 520 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం తర్వాత ఆయన 'జైలర్ 2' చేస్తున్నాడు. శరవేగంగా షూటింగ్ కార్యక్రమాలను జరుపుకుం టున్న ఈ చిత్రం కోసం ఇండియా మొత్తం ఎదురు చూస్తోంది. ఈ సినిమా పూర్తి అయ్యాక, కమల్ హాసన్ తో కలిసి ఆయన ఒక మల్టీస్టార్రర్ చిత్రం చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసాడు. కథ సిద్ధమైంది,కానీ దర్శకుడు ఎవరు అనే విషయం లో నిన్న మొన్నటి వరకు చిన్నపాటి అయోమయ్యం ఉండేది. మొదట్లో ఈ చిత్రాన్ని లోకేష్ కనకరాజ్ తెరకెక్కిస్తాడని అనుకున్నారు, కానీ ఆయన అందుకు అంగీకరించలేదు.


ఆ తర్వాత డ్యూడ్ మూవీ హీరో ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తాడనే ప్రచారం జరిగింది. దీనికి ప్రదీప్ స్పందిస్తూ తన ఫోకస్ మొత్తం ఇప్పుడు నటన పైనే ఉంది, దర్శకత్వం వహించే ఛాన్స్ లేదని తేల్చి చెప్పాడు

.ఇప్పుడు రీసెంట్ గా ఈ కాంబినేషన్ ని తెరకెక్కించేందుకు 'జైలర్ 2' డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ ముందుకు వచ్చినట్టు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్న వార్త. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ఈ సినిమా తర్వాతే రజినీకాంత్ తన కెరీర్ కి ముగింపు పలకబోతున్నాడని టాక్. రజినీకాంత్ సినీ కెరీర్ కమల్ హాసన్ తోనే మొదలైంది. అప్పట్లో వీళ్లిద్దరు కలిసి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించాడు. కమల్ హాసన్ హీరో గా నటిస్తే, అందులో రజినీకాంత్ విలన్ గా నటించేవాడు. ఇప్పుడు అదే కమల్ హాసన్ తో కలిసి మల్టీస్టార్రర్ చిత్రం చేసి తన సినీ కెరీర్ కి టాటా చెప్పే ప్రయత్నం రజినీకాంత్ చేస్తున్నాడని టాక్. ఇదే కనుక నిజమైతే అభిమానుల గుండెలు బద్దలు అయిపోతాయి. చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది.

# గ్రేటర్ సిటీగా తిరుపతి

తిరుపతి, అక్టోబరు 29,

తిరుపతి ఇక గ్రేటర్ సిటీగా మారనుంది! 30 చ.కి.మీ నుంచి 284 చ.కి.మీకి విస్తరించనున్న నగరం, 4.5 లక్షల నుంచి 7.5 లక్షలకు పెరగనున్న జనాభా. గ్రామీణ, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని 63 గ్రామ పంచాయతీలు విలీనం కానున్నాయి. సీఎం ఆదేశాలతో ఈ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదం కోసం సిద్ధమయ్యాయి. తిరుపతి రూపురేఖలు మారనున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఆమోదం రాగానే తిరుపతి గ్రేటర్ సిటీగా మారనుంది.ఆంధ్రప్రదేశ్‌లో మరో నగరం గ్రేటర్ సిటీగా మారుతోంది. గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలకు తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తిరుపతి నగరం విస్తీర్ణం 30.17 చ.కి.మీ నుంచి 283.80 చ.కి.మీకి పెరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు.. తిరుపతి మహా నగరపాలికలో తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని 63 గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని జిల్లా యంత్రాంగం ఈ ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు తిరుపతి గ్రేటర్ తీర్మానాన్ని ప్రభుత్వ ఆమోదం కోసం పంపుతున్నట్లు మేయర్ డాక్టర్ శిరీష ప్రకటించారు.ఎస్వీయూ సెనేట్ హాల్లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో, కమిషనర్ ఎన్.మౌర్య 108 అంశాలతో కూడిన ఎజెండాను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం లభించింది. ఈ విస్తరణతో తిరుపతి నగరం విస్తరించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల తిరుపతి పర్యటనలో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఈ విస్తరణ అవసరమని సూచించారు. ఈ సూచనల మేరకు జిల్లా యంత్రాంగం గ్రామ పంచాయతీలను విలీనం చేసే ప్రతిపాదనలను రూపొందించింది. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వ ఆమోదం పొందిన తర్వాత గ్రేటర్ తిరుపతి ఏర్పడనుంది.గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు తాత్కాలికంగా వాయిదా వేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేల అభిప్రాయాలు తెలుసుకుని, మరిన్ని పంచాయతీలను విలీనం చేయాలని కోరారు. అయితే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు దీనికి అంగీకరించలేదు.. వారు వెంటనే ఓటింగ్‌కు డిమాండ్ చేశారు. మేయర్ శిరీష కో ఆప్షన్ సభ్యులు, ఎంపీ, ఎమ్మెల్సీల



అభిప్రాయాలను సేకరించారు. ఎక్కువమంది సభ్యులు గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనకు మద్దతు ఇవ్వడంతో మెజారిటీ సభ్యుల ఆమోదంతో గ్రేటర్ ప్రతిపాదనలను ఆమోదించినట్లు మేయర్ శిరీష ప్రకటించారు.తిరుపతి నగరం గ్రేటర్‌గా మారనుంది. ప్రస్తుతం 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న తిరుపతి, గ్రేటర్‌గా మారితే 284 చదరపు కిలోమీటర్లకు విస్తరిస్తుంది. జనాభా కూడా 4.50 లక్షల నుండి 7.50 లక్షలకు పెరుగుతుంది. వార్షిక ఆదాయం రూ.149 కోట్ల నుండి రూ.182 కోట్లకు చేరుకుంటుంది. చంద్రగిరి, రేణిగుంట వంటి పెద్ద పంచాయతీలు తిరుపతిలో కలిసిపోతాయి. నగరం విమానాశ్రయం దాటి, వికృతమాల వరకు విస్తరించనుంది. ఈ విస్తరణతో తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ఈ మార్పులతో తిరుపతి రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. అయితే గ్రేటర్ తిరుపతి ఏర్పాటు విషయంలో భౌగోళికంగా ప్రజలకు గానీ, అధికార యంత్రాంగానికి గానీ అసౌకర్యం కలగని రీతిలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆ మేరకే గ్రేటర్ తిరుపతికి ప్రతిపాదనలు పంపారు.

## ఏపీలో కొత్త పొత్తులు

విజయవాడ, అక్టోబరు 29,

ఏపీలో కమ్యూనిస్టులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కడతారా? అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? రెండువైపుల నుంచి చర్చలు మొదలయ్యాయా? రెండు వైపులా ఇది అవశ్యమా? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎన్డీఏలో తెలుగుదేశంతో పాటు జనసేన భాగస్వామ్య పక్షాలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి ఉంది. వైసిపి ఒంటరి పోరాటం చేస్తోంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమి లో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో తటస్థ వైఖరి అనుసరిస్తోంది. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి బిజెపి విషయంలో సానుకూలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరాటం కంటే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడమే మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం జగన్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన అసలు పేరు మధుసూదన్ రెడ్డి గా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి బంధువు అవుతారని కూడా ప్రచారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్న సమయంలో మధు అనారోగ్యానికి గురైతే పరామర్శించారు. అటు తరువాత సిపిఎం అనుబంధ పత్రికకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారీగా ప్రకటనలు కూడా వచ్చాయి. దీంతో గత పదేళ్లుగా జగన్ విషయంలో సిపిఎం పెద్దగా సౌండ్ చేయలేదు. కానీ సిపిఐ మాత్రం గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా గట్టిగానే స్టేట్మెంట్లు ఇచ్చిందిమారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జగన్ పొత్తుల విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒంటరి పోరాటం చేయడం సాహసమే. అందుకే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడం మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య ఎంపికయ్యారు. దీని వెనుక పొత్తు స్నేహం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. అయితే బిజెపికి జగన్ సానుకూలంగా ఉంటారు. ఇండియా కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. అలాగే చంద్రబాబు పట్ల వామపక్షాలకు ఆ స్థాయిలో వ్యతిరేకతలేదు. కానీ ఇప్పుడు ఏపీలో రాజకీయ ఉనికి చాటుకోక తప్పదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ కంటే ఏపీలో వైసీపీ బలంగా ఉంది. అందుకే ఆ పార్టీతో స్నేహం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి వామపక్షాలు.ఇప్పటివరకు ఒంటరి పోరాటం అన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నినాదం.

# బీహార్ లో చావో రేవో...

పాట్నా, అక్టోబరు 29,

బీహార్ లో ఏ పార్టీ గెలుస్తుంది? ఎన్డీఏ తిరిగి అధికారంలోకి వస్తుందా? లేకుంటే మహాఘట్ బంధన్ విజయాన్ని కైవసం చేసుకుంటుందా? ఎన్డీఏ గెలిస్తే ఏమవుతుంది? ఓడిపోతే ఏం జరగనుంది? బీహార్ ఎన్నికలు ఏపీ పై ఎలాంటి ప్రభావం చూపుతాయి? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు ఎన్డీఏ తరపున బీహార్లో ప్రచారానికి వెళ్తానని చెప్పారు. ఎన్డీఏ లో కీలక భాగస్వామి కావడంతో కేంద్ర పెద్దల పిలుపుమేరకు ఆయన బీహార్ ప్రచారానికి వెళ్ళనున్నారు. ఢిల్లీలో చంద్రబాబు ప్రచారం చేశారు. అక్కడ బిజెపి విజయం సాధించింది. అందుకే చంద్రబాబును బిజెపి పెద్దలు ప్రచారానికి పిలిచినట్లు తెలుస్తోంది. మరోవైపు బీహార్ సీఎం నితీష్ కుమార్ తో సైతం చంద్రబాబుకు మంచి సంబంధాలు ఉన్నాయి.బీహార్లో నువ్వా నేనా అన్నట్టు పరిస్థితి ఉంది. ఎన్డీఏ వర్సెస్ మహా ఘాట్ బంధన్ గట్టిగానే తలపడుతున్నాయి. ప్రస్తుతానికి చూస్తే మహా ఘాట్ బంధన్ దూకుడు మీద ఉంది. ఆ కూటమిలో కీలక భాగస్వామిగా ఆర్జెడి ఉంది. కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ బీహార్ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. గత 15 రోజులుగా బీహార్లో విస్తృత ప్రచారం చేశారు. మరోవైపు ఆర్ జెడి నేత తేజస్వి యాదవ్ యువతను తన వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే మహాఘాట్ బంధన్ గట్టిగానే




పోరాటం చేస్తోంది. మరోవైపు నితీష్ కుమార్ గత రెండు దశాబ్దాలుగా బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన విషయంలో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తే మాత్రం ఎన్డీఏకు ఇబ్బందికరమే.ఒకవేళ ఇక్కడ మహా ఘాట్ బంధన్ విజయం సాధిస్తే కాంగ్రెస్ పార్టీకిజవసత్వాలు వస్తాయి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకునే అవకాశం ఉంది. ఆ ప్రభావం ఏపీ పై కూడా ఉండనుంది. అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరం. ఇప్పటికే ఆ పార్టీకి చాలా మంది నేతలు గుడ్ బై చెప్పారు. మరికొందరు కూటమి పార్టీల్లో అవకాశం లేక ఉండిపోయారు. అటువంటి వారంతా కాంగ్రెస్ పార్టీ గూటికి చేరితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరం. అంతిమంగా అది టిడిపి కూటమికి మేలు చేస్తుంది.మరోవైపు బీహార్లో ఎన్డీఏ కూటమి ఓడిపోతే మాత్రం తెలుగుదేశం వైఖరిలో మార్పు ఖాయం. ఎందుకంటే 2026లో మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. అప్పుడు కూడా బిజెపికి, వాటి మిత్రపక్షాలకు ప్రతికూల ఫలితాలు వస్తే చంద్రబాబు యూ టర్న్ తీసుకునే అవకాశం ఉంది. అయితే అప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బిజెపి ఆప్షన్ గా మారుతుంది. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీకి ఇప్పటివరకు దూరంగా ఉంటూ వస్తోంది వైయస్సార్ కాంగ్రెస్. అదే సమయంలో బిజెపి పట్ల సానుకూలంగా ఉంది. అయితే ఈ పరిణామాలన్నీ బీహార్ ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉంటాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి

## వందేభారత్ స్లీపర్ రెడీ...



చెన్నై, అక్టోబరు 29,
భారతదేశంలో మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలు ప్రారంభానికి సిద్ధమవుతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం భారత రైల్వే ఈ స్లీపర్ ట్రైన్‌ను అత్యానిధునిక హంగులతో తీర్చిదిద్దింది. దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులకు విలాసవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించేలా విమానాల స్ఫూర్తితో కూడిన ఇంటీరియర్‌లు, ఆధునిక సౌకర్యాలు, మెరుగైన భద్రతా వ్యవస్థలతో ప్రీమియం అనుభవాన్ని అందిచేలా క్యాబిన్‌ను డిజైన్ చేసింది. అయితే వందేభారత్ స్లీపర్ కోచ్‌లోని ఫస్ట్‌క్లాస్ క్యాబిన్‌కు సంబంధించిన నమూనా వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ నమూనా వీడియోలో ఫస్ట్-క్లాస్ స్లీపర్ క్యాబిన్‌లు, ఎర్గోనామిక్ సీటింగ్, ఆటోమేటిక్ డోర్లు, రీడింగ్ లైట్లు, వై-ఫై కనెక్టివిటీ, జూః ఛార్జింగ్ పాయింట్లు, డిజిటల్ డిస్‌ప్లే ప్యానెల్‌లు, సెన్సార్ ఆధారిత లైటింగ్ ఉన్నాయి. ఇవి నెటిజన్లను ఎంతగానో అకర్షించాయి. ఇది చూడ్డానికి చాలా ప్రీమియంగా కనిపిస్తున్నాయి. చాలా మంది నెటిజన్లు ఈ డిజైన్‌ను ప్రశంసిస్తూ, భారతదేశ ఇంజనీరింగ్ పురోగతిపై గర్వం వ్యక్తం చేశారు. మరికొందరు మాత్రం ప్రజా రవాణాలో అలాంటి లగ్జరీని క్యాబిన్‌లను ఏర్పాటు చేస్తే.. జనాలు వాటిని నాశనం చేస్తారని చెప్పుకొచ్చారు.మరికొందరు ఈ ప్రీమియం సేవలను పొందే అర్హతను నిర్ణయించడానికి క్రెడిట్ స్కోర్ మాదిరిగానే "పౌర స్కోర్" వ్యవస్థను ప్రవేశపెట్టాలని కామెంట్ చేశారు. ఇదిలా ఉండగా భారతదేశపు మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ ట్రైన్‌లో ప్రయాణించేందుకు చాలా మంది ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని మరో వ్యక్తి కామెంట్ చేశారు.ఇక దేశంలో మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ ఢిల్లీ-పాట్నా మార్గంలో నడవనున్నట్టు తెలుస్తోంది. ఈ ట్రైన్ గంటకు 160 కి.మీ వేగంతో నడుస్తుంది. ఈ మొట్టమొదటి వందేభారత్ స్లీపర్ ట్రైన్ 16-కోచ్‌ల కాన్ఫిగరేషన్‌ను కలిగి ఉంటుంది, ఇందులో పదకొండు ంఅ 3-టైర్ కోచ్‌లు, నాలుగు ంఅ 2-టైర్ కోచ్‌లు, ఒక ంఅ ఫస్ట్ క్లాస్ కోచ్ ఉంటాయి, 823 స్లీపర్ బెర్త్‌లతో దాదాపు 1,128 మంది ప్రయాణికులకు వసతి కల్పిస్తుంది.

యారాడలో విరిగిపడిన కొండ చరియలు

గాజువాక
మొంథా తుఫాను కారణంగా యారాడలో కొండ చరియాలు విరిగి పడ్డాయి. ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.మంగళవారం నుండి వర్షం కురస్తుండడంతో ప్రమాదం జరిగింది. యారాడ నుండి సింధియా వస్తున్న వాహనాలు కొద్దీ సేపు నిలిచి పోయాయి.

==============================

## పలు చోట్ల తుపాను బీభత్సం

విజయవాడ అక్టోబరు 29,
రెండు తెలుగు రాష్ట్రాల్లో మొంథా తుపాను బీభత్సం సృష్టిస్తోంది. కొన్ని గంటల్లో తీవ్ర వాయుగుండం గా మారి తుపాన్ బలహీనపడ నుంది.శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖ, విజయనగరం అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఉడేరు నదికి వరద నీరు పెరిగింది.వరద నీరు తాకిడి కారణంగా ఉడేరు నదికి గండి పడి పంట పొలాల్లోకి వరద నీరు వస్తోంది. దింతో చాకిపల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు.

## కీలక దశకు ఉప ఎన్నిక పోరు



హైదరాబాద్, అక్టోబరు 29, (
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ విజయం సాధించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక చర్యలు చేపట్టారు. ప్రతి డివిజన్‌కు మంత్రులు బాధ్యతలు కేటాయించారు. రహమత్‌నగర్ డివిజన్ బాధ్యతలను కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపట్టనున్నారు. బోరబండ డివిజన్ సీతక్క, మల్లు రవి.. వెంగళరావునగర్‌లో తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి.. సోమాజిగూడలో శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్.. షేక్‌పేట్‌లో కొండా సురేఖ, వివేక్.. ఎర్రగడ్డలో దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు.. యూసుఫ్‌గూడలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పగించారు.తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోరు కీలక దశకు చేరుకుంది. గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ తమ ప్రచారంలో వేగాన్ని గణనీయంగా పెంచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల వ్యూహంలో భాగంగా, నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా సీనియర్ మంత్రులకు ప్రచార బాధ్యతలను అప్పగించారు. మంత్రులను ముఖ్య ప్రచారకులుగా నియమించి.. అన్ని ప్రాంతాలను ముమ్మరంగా కవర్ చేసేలా నిర్ణయం తీసుకుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ప్రచార బృందాలను పర్యవేక్షిస్తున్నారు. మంత్రులకు అప్పగించిన డివిజన్ల వారీగా ప్రచార బాధ్యతలు ఇలా ఉన్నాయి. షేక్ పేట డివిజన్‌లో ప్రాంతంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి , కొండా సురేఖ ప్రచార బాధ్యతలు స్వీకరించారు. యూసుఫ్ గూడ డివిజన్ ప్రాంతంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

# ఎరుపు రంగు బట్టలు వేసుకోవద్దు

అదిలాబాద్, అక్టోబరు 29,
తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో పులి సంచారంతో అటవీ శాఖ అప్రమత్తమైంది. ప్రజలు ఎరుపు రంగు దుస్తులు ధరించవద్దని, ఉదయం 10 తర్వాతే బయటకు వెళ్లి, సాయంత్రం 5 లోపు ఇళ్లకు చేరాలని హెచ్చరికలు జారీ చేశారు. పులి దాడి ఘటనలు భయపెడుతుండటంతో, రైతులు, కూలీలు పొలం పనులకు వెళ్లడానికి జంకుతున్నారు. అధికారులు గస్తీ ముమ్మరం చేశారు. ప్రజలు ఒంటరిగా బయటకు వెళ్లవద్దని పులి కనిపిస్తే.. అరవాలని సూచిస్తున్నారు.తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని జిల్లాల ప్రజలకు అటవీ శాఖ అధికారులు కీలక అలర్ట్ జారీ చేశారు. వారు ఎరుపు రంగు దుస్తులు ధరించవద్దని సూచించారు. అలానే ఉదయం 10 గంటల తర్వాతే బయటకు వెళ్లాలని.. సాయంత్రం 5 గంటల లోపు ఇళ్లకు చేరాలని సూచిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు రాత్రింబవళ్లు గస్తీ కాస్తున్నారు. మరి ఈ స్థాయిలో హెచ్చరికలు జారీ చేయడానికి కారణం ఏంటంటే.. ఈ పరిసర ప్రాంతాల్లో పులి సంచరించడం. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని మెట్ ఇంధాని అటవీ ప్రాంతానికి మహారాష్ట్ర సరిహద్దు నుంచి పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. 2020 నుంచి ఇలా పత్తి పంట చేతికొచ్చే సమయానికి.. అటవీ ప్రాంతానికి దగ్గర ఉన్న గ్రామాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది.పులి.. పశువుల మీదనే కాక.. పొలాల్లో పని చేసే కూలీల మీద కూడా దాడి చేసి చంపేస్తుంది ఈ ఏడాది ఆగస్టు 18న సిర్పూర్ (టి) రేంజి పరిధిలోకి ప్రవేశించిన పులి ఒకటి.. ఆవు మీద దాడి చేసింది. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో పులి తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. ఒక వారం రోజుల నుంచి ఇది మండలంలోని గెర్రెగూడ, రాస్పెల్లి, సార్సాల పరిసరాల్లో సంచరించిన ఆనవాళ్లు వెలుగులోకి వచ్చాయి.మూడు నెలల క్రితం ఈ ప్రాంతానికి వచ్చిన పులి.. వారం రోజుల నుంచి



పెంచికల్పేట్, సిర్పూర్(టి), కాగజ్నగర్ అటవీ ప్రాంతంలోని పాతసార్సాల, గెర్రెగూడ, రాస్పెల్లి గ్రామ పరిసరాల్లో సంచరిస్తోంది. పత్తి పంట చేతికి వచ్చిన వేళ.. ఇలా పులి సంచరించడం.. రైతులను భయపెడుతోంది. గతంలో దాడి చేసిన ఘటనలు గుర్తు చేసుకుంటున్న రైతులు, కూలీలు పొలం పనులకు వెళ్లడానికే భయపడుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాల్లో రేయింబవళ్లు గస్తీ కాస్తున్నారు. అటవీశాఖ అధికారులు.. రైతులు, కూలీలకు పలు సూచనలు చేస్తున్నారు. జనాలు ఎవరూ ఒంటరిగా పొలాలకు వెళ్లరాదని సూచిస్తున్నారు. పొలం పనులకు, ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు ఉదయం 10 గంటల తర్వాతే వెళ్లి, సాయంత్రం 5 గంటలలోపే ఇండ్లకు చేరుకోవాలని సూచిస్తున్నారు. అలానే ఎర్రని దుస్తులు ధరించడం వల్ల పులితో ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది కనక.. అలంటి రంగు దుస్తులకు దూరంగా ఉండమని చెబుతున్నారు. అలానే పులి కనిపిస్తే.. వెనక్కి తిరిగి పరిగెత్తకూడదని.. పులికి మన వీపు కనిపిస్తే.. వెంబడించే ప్రమాదం ఉంది కనుక.. అలా చేయవద్దని.. పులి కనిపిస్తే పెద్దగా అరవాలని సూచించారు. ప్రమాదం ఉందని, పెద్దగా అరుపులు చేయాలని సూచిస్తున్నారు. వారం రోజులుగా తమ ప్రాంతంలో పులి సంచరిస్తోందని.. పత్తి తీసే సమయంలో ఇలా పులి సంచారం వల్ల కూలీలు పనులకు రావడానికి భయపడుతున్నారని రాస్పెల్లికి చెందిన రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అటవీ సిబ్బంది గ్రామాల పరిసరాల్లోనే గస్తీ కాస్తున్నట్టు తెలిపారు. ఒంటరిగా ఎవరూ బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు వహిస్తున్నామని అన్నారు.సుమారు 5 సంవత్సరాల క్రితం అనగా.. 2020 నవంబరు 11న చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి మీద పులి దాడి చేసి హతమార్చింది. అలానే గత సంవత్సరం అనగా 2024 నవంబర్ 29న గన్నారం గ్రామానికి లక్ష్మి అనే మహిళ చేలో పత్తి తీస్తుండగా.. పులి ఆమె మీద దాడి చేసింది.

### కట్టు, బొట్టు మార్చిన కవిత
## జయలలిత స్ఫూర్తితో కొత్త ఇమేజ్..?

హైదరాబాద్, అక్టోబరు 29,
తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె.. కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత.. రాజకీయంగా తన శైలిని మార్చుకున్నారు. ఆమె కట్టుబొట్టు, పబ్లిక్ అప్పియరెన్స్ జయలలితను పోలి ఉన్నాయనే చర్చ నడుస్తోంది. గెలుపే లక్ష్యంగా బలమైన మహిళా నాయకురాలిగా నిలదొక్కుకునేందుకు ఆమె ఈ వ్యూహాత్మక అడుగులు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. జాగృతి జనం బాట యాత్రలో పాల్గొంటూ.. మహిళా సాధికారత, బీసీ రాజ్యాధికారం అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఇది ఆమె రాజకీయ భవిష్యత్తుకు కొత్త కోణాన్ని ప్రతిబింబిస్తోంది.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత .. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత తన రాజకీయ పయనాన్ని కొత్త కోణంలో ప్రారంభించారు. ఆమె ప్రస్తుత కట్టు, బొట్టు శైలి.. ప్రజా సమక్షంలో ఆమె ఆహార్యం చూస్తుంటే.. తమిళనాడు రాజకీయ చరిత్రలో అమ్మగా గుర్తింపు పొందిన దివంగత ముఖ్యమంత్రి జయలలితను తలపిస్తుందన్న చర్చ తెలంగాణ రాజకీయాల్లో నడుస్తోంది. ఈ మార్పు కేవలం సౌందర్యానికే పరిమితమా లేక జయలలిత తరహాలో బలమైన మహిళా నాయకురాలిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించుకునేందుకు వేసిన వ్యూహాత్మక అడుగా.. అన్నది ప్రస్తుతం రాజకీయ విశ్లేషకుల మధ్య ప్రధాన ప్రశ్నగా మారింది.రాజకీయాలలో దృష్టిపరమైన గుర్తింపు ఎంత ముఖ్యమో జయలలిత నిరూపించారు. ఆమె ప్రత్యేకమైన వస్త్రధారణ, బాడీ లాంగ్వేజ్.. ధైర్యంగా మాట్లాడే ధోరణి ఆమెను ఐకాన్‌గా మార్చాయి. తాజాగా 'జాగృతి జనం బాట యాత్ర'లో కవిత కట్టుబొట్టు, పబ్లిక్ ఇంటరాక్షన్ స్టైల్‌ను గమనించినవారు.. ఆమె జయలలిత ఆహార్యాన్ని రీక్రియేట్ చేస్తున్నారని భావిస్తున్నారు. ఈ విజువల్ పాలిటిక్స్ ద్వారా ఆమె ప్రేక్షకుల మనసుల్లో బలమైన నాయకురాలిగా నిలిచిపోవాలనే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మహిళా ఓటు బ్యాంకులో బలమైన సెంటిమెంట్‌ను క్రియేట్ చేయాలనే ఉద్దేశంతోనే కవిత ఈ నాయకత్వ శైలిని ఎంచుకున్నారని చర్చ జరుగుతోంది. ఇది మహిళా సాధికారతకు ప్రతీకగా.. సాఫ్ట్ లీడర్ ఇమేజ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.కవిత వేస్తున్న ప్రతి అడుగు.. జనం బాటలో నేరుగా ప్రజలను కలవడం, సాఫ్ట్ స్పీచ్‌తో పాటు విమర్శలు చేయడం.. ఇవన్నీ కూడా 'తాను తిరిగి వచ్చాను.. రాజకీయ ఆట ఇంకా ముగియలేదు' అనే స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. కవిత తన రాజకీయ ప్రయాణంలో ఇమేజ్ గేమ్‌కే పరిమితం కాకుండా.. బలమైన సామాజిక అజెండాను ఎంచుకున్నారు. ఆమె ప్రధానంగా బీసీల అజెండాను భుజాన వేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారంపై ఉన్న బలమైన డిమాండ్‌ను ఉపయోగించుకోవాలని



చూస్తున్నారు. తన తండ్రి కేసీఆర్‌తో రాజకీయ విభేదాలు వచ్చినా.. అవినీతి ఆరోపణలు ఎదురైనా, తెలంగాణ అస్తిత్వాన్ని , బీసీ వాదాన్ని ప్రచారం చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాలని ప్రయత్నిస్తున్నారు.కవిత గతంలో మహిళా రిజర్వేషన్ల కోసం కృషి చేశారు. ఇప్పుడు ఈ అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకువచ్చి.. బీసీ వాదంతో కలిపి సమపాలనలో ముందుకు తీసుకువెళితే.. మహిళా లోకాన్ని రాజకీయంగా చైతన్యం చేయగలుగుతారని భావిస్తున్నారు. ఏ ఇతర పార్టీలో చేరినా తగిన ప్రాధాన్యత లభించకపోవచ్చు.. అలాగే తండ్రిని విమర్శించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. కాబట్టి.. సొంత పార్టీని ఏర్పాటు చేయడం ద్వారా తను అనుకున్న రాజకీయ మార్గంలో వెళ్లడానికి.. రాజకీయ ఉనికిని చాటుకోవడానికి ఇది సరైన మార్గం అని కవిత విశ్వసిస్తున్నట్టు కనిపిస్తోంది.అయితే.. జయలలితకు ఉన్న మాస్ ఇమేజ్ రావాలంటే.. కేవలం కట్టుబొట్టు సరిపోదు, నేరుగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి.. ప్రజల కష్ట సుఖాలను పంచుకొని, వారికి కొత్త పరిష్కారాలను చూపించగలిగితేనే మాస్ లీడర్‌గా స్థిరపడగలుగుతారని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా.. ఆమె జయలలితను గుర్తు చేసే విధంగా అప్పియరెన్స్ ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## ఘనంగా అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు
### మెగా రక్తదాన శిబిరంలో సీపీ గౌష్ ఆలం

కరీంనగర్, అక్టోబర్ 29(భారతశక్తి ప్రతినిధి):పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని,



బుధవారం కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోనీ అస్త్ర కన్వెన్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించామని పోలీసు కమీషనర్ సీపీ గౌష్ ఆలం తెలిపారు. ఈ శిబిరంలో పలువురుతో పాటు సిపి రక్తదాతలతో కలిసి ఉత్సాహంగా రక్తదానం చేశారు.ఈ సందర్బంగా సిపి మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21 ఇండో - చైనా సరిహద్దుల్లో (లఢక్ ) లో జరిగిన సంఘటనలో 10 మంది జవానులు మృతి చెందినందున ప్రతీ సంవత్సరం అక్టోబర్ నెల 21 వ తేదీన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రజలను భగస్వామ్యులను చేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉద్దేశంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు తమ విధులను నిర్వహించే విధానాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు పోలీసు అమరవీరులను స్మరిస్తామన్నారు. ఈమేరకు మెగా రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం వలన అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడుతుందన్నారు. తలసీమియా బాధితులకు ఎంతో అవసరమన్నారు. సామజిక బాధ్యతతో అందరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 160 యూనిట్లను సేకరించామని , ఈ రక్తాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ సెంటర్ కు అందజేశామని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి లతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

# వివాదాల్లో మంత్రి జూపల్లి

మహబూబ్ నగర్, అక్టోబరు 29,
ఇటీవల తరుచుగా వివాదాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు ఎందుకు ఉంటున్నారు. ఆయనకు ఆయనే వివాదాలను కోరి తెచ్చుకుంటున్నారా? లేక ఎవరైనా మంత్రిని టార్గెట్ చేశారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎందుకు అంటే.. ఇటీవల కొన్ని పత్రికలు మంత్రి జూపల్లి కొన్ని ప్రభుత్వ శాఖలపై ఆర్టీఐ దరఖాస్తులు వేసినట్లుగా వార్తలు ప్రచురించాయి. ప్రధానంగా భూముల కేటాయింపులు, టెండర్లపైనే ఆరా తీసినట్టు అందులో రాసుకొచ్చారు. ఏ భూములు ఎవరికి.. ఏ కంపెనీ ఎంతకు కోట్ చేసిందని కూపీ లాగారని కథనాలు రాశాయి కొన్ని వార్తా పత్రికలు. సమాచారం ఇవ్వకపోతే అధికారులకు దమ్కీలు కూడా ఇచ్చారని రాశాయి. అంతే కాదు భవిష్యత్ ప్రణాళికలో భాగంగానే వివరాలు సేకరిస్తున్నారని.. ప్రచురించాయి. ఇది ప్రభుత్వంలో చర్చకు దారి తీసిందట. సచివాలయంలోనూ దీనిపై గుసగుసలాడుకుంటున్నారట. ఆర్టీఐ అస్త్రాల ఆరోపణలపై రియాక్ట్ అయిన జూపల్లి:. అయితే ఆర్టీఐ అస్త్రాలు.. అనే ఆరోపణలపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్ట్రాంగ్‌గా రియాక్ట్ కావాల్సి వచ్చింది. తనపై పని కట్టుకుని ఒక వర్గం మీడియా, సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని జూపల్లి మండిపడ్డారు. వికృత రాజకీయాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేయడంతో పాటు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఆర్టీఐ ద్వారా కొన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని అడిగించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని జూపల్లి ఫైర్ అయ్యారు. తన పరువుకు భంగం కలిగించేలా, అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా



కుట్ర పన్నుతున్నారన్నారు. ఆ వార్తను ప్రచురించిన సంస్థలు, సోషల్ మీడియా పోస్టుల వెనుక ఉన్న బాధ్యులైన వ్యక్తులపై పరువు నష్టం దావా దాఖలు చేస్తానంటు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు మంత్రి జూపల్లి. టెండర్ల ప్రక్రియలో జూపల్లి, రిజ్వీకి మధ్య వార్ :. ఇలా వివాదాల నేపథ్యంలో మంత్రి జూపల్లిని టార్గెట్ చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖలో దాదాపు 100 కోట్ల విలువైన హై-సెక్యూరిటీ హోలోగ్రామ్ లేబుల్స్ టెండర్ల ప్రక్రియలో మంత్రి జూపల్లికి, ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీకి మధ్య తీవ్ర విభేదాలు వచ్చాయి. రిజ్వీ ఉద్దేశపూర్వకంగా టెండర్ల ప్రక్రియను ఆలస్యం చేశారని, దాని వల్ల పాత వెండర్‌కే ప్రయోజనం కలుగుతోందని జూపల్లి ఆరోపించారు. మంత్రి ఆదేశాలను పట్టించుకోలేదనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, రిజ్వీ వీఆర్ఎస్ తీసుకున్నారు. ఈ వ్యవహారంలో మంత్రి పాలనాపరమైన జోక్యం, అధికారిపై చర్య తీసుకోవాలని పట్టుబట్టడం తీవ్ర చర్చకు దారితీసి వివాదానికి కారణమైంది. రిజ్వీ ఎఖీూ తీసుకున్న వివాదంలో, మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎస్‌కు లేఖ రాయడం, వీఆర్ఎస్‌ను అడ్డుకోవాలని ప్రయత్నించడం వంటి చర్యలు చర్చనీయాంశమయ్యాయి. ఈ పరిణామంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులను వేధిస్తోందని, మంత్రి అవినీతి సొమ్ము పంపకాల విషయంలో గొడవ పడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేసింది. మంత్రి నేరుగా ఆర్టీఐకి దరఖాస్తు చేయ వచ్చా? జనరల్‌గా ఓ మంత్రి ప్రభుత్వంలోని ఇతర శాఖలపై లేదా సొంత శాఖపై ఆర్టీఐ దరఖాస్తులు వేయడం అనేది జరగదు. ఎందుకు జరగదు అంటే.. మంత్రులు ప్రభుత్వంలో అంతర్భాగం. వారికి తమ శాఖలకు లేదా ఇతర శాఖలకు సంబంధించిన సమాచారాన్ని పొందడానికి ప్రత్యేక ఛానల్ ఉంటుంది. నేరుగా శాఖ కార్యదర్శులను పిలిచి, ఫైళ్లను అడిగి, లేదంటే అధికారిక నోట్ ఫైలింగ్ ద్వారా సమాచారాన్ని పొందవచ్చు. ఓ మంత్రి కామన్ పబ్లిక్‌లాగా ఆర్టీఐని ఆశ్రయించారంటే.. అది ఇంపాజిబుల్ అనే చెప్పాలి. దీన్నిబట్టి.. చూస్తే.. మంత్రి జూపల్లి ప్రభుత్వానికి భారీగా ఆదాయం తెచ్చిపెట్టే.. కీలకమైన శాఖలు నిర్వహిస్తున్నారు. మొన్నటి రిజ్వీ ఎఖీూ వివాదాన్ని బీఆర్ఎస్ పొలిటికల్ గా వాడుకుంది.

మంత్రులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. ఇలా మళ్లీ జూపల్లిని కార్నర్ చేయాలనే స్కెచ్ బీఆర్ఎసే వేసింది అంటున్నారు మంత్రి అనుచరులు. ఏదిఏమైనా మంత్రి జూపల్లి ఇలా.. వరుస వివాదాల్లో ఇరుక్కోవడం అటు పార్టీకి.. ఇటు ప్రభుత్వానికి కొంత ఇబ్బందిగా మారిందని మాత్రం చెప్పవచ్చు. దీనిపై జూపల్లి ఎంతవరకు వెళ్తారనేది తెలియాల్సి ఉంది

# అవగాహన కల్పిద్దాం...ఇంధనాన్ని పొదుపుచేద్దాం"

విశ్వ వ్యాప్తంగా వాతావరణం వేడెక్కి కాలుష్యం కబళిస్తోందనీ ప్రతి నిత్యం వింటూనే ఉన్నాము. వీటిని నివారించాలంటే వేడిని, కాలుష్యాన్ని విడుదల చేస్తున్న అన్నింటి గురించి తెలుసుకొని మన వంతుగా బాధ్యతాయుతంగా ఉండవలసిన అవసరం ఉంది. అధిక ఉష్ణోగ్రతలు, కాలుష్య కారకాలకు తప్పనిసరిగా అడ్డుకట్ట వేయాలి. ప్రతి ఏటా ప్రపంచ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికి మన దేశం జాతీయ ఇంధన పరిరక్షణ దినం జరుపుకుంటున్నప్పటికి పూర్తి స్థాయిలో ప్రజలు ప్రభావితం కావడం లేదు.

ఈ సందర్భంగా వనరులను సర్గిగా వినియోగించడం వల్ల పర్యావరణానికీ, జీవావరణానికీ ఏ రకంగా మేలు జరుగుతుందో ప్రజలలో అవగాహన కల్పించడం,వనరులను అధికంగా వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను తెలియచేయడం, అవసరానికి మించి అడవులను తొలగించడం వల్ల, గనుల తవ్వకాలు, ప్రధానంగా బొగ్గు, చమురు, సహజ వాయువుల వెలికితీత లాంటివి అత్యధికంగా చేయడం వల్ల కలిగే అనర్థాలను తెలుపడం ముఖ్య ఉద్దేశంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

భూమి వేడెక్కకుండా చూసుకోవలసిన భాధ్యత మనందరిది.భూ అంతర్భాగంలో మనకు అవసరమైన వాటి కొరకు ఇంధనాలను మండించడం ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయడం భూమి వేడెక్కడానికి ప్రధాన కారణం. ప్రతి రోజూ ప్రపంచ వ్యాప్తంగా మానవ జనాభా నాగరిక జీవనాన్ని గడపడానికి విద్యుత్తును వినియోగిస్తోంది. ప్రజల అభివృద్ధితో పాటుగా వనరుల వినియోగం కూడా పెరుగుతూ వస్తోంది. కాబట్టి ముఖ్య వనరులైన బొగ్గు, చమురు, సహజ వాయువుల ఉత్పత్తులూ, అణుశక్తిని ఉపయోగించడం సహజం అయింది.

కానీ వీటినిపక్కన పెట్టి సూర్యరశ్మి, గాలి, సముద్ర అలలూ, తదితర మార్గాల ద్వారా అతి తక్కువ కాలుష్యంతో, ఉష్ణోగ్రతలు పెంచకుండా విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి సిద్ధం కావలసిన అవసరం ఎంతైనా ఉంది.ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం ఉత్పత్తి అయ్యే విద్యుత్తు కోసం బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించి ప్రపంచ వాతావరణ అత్యవసర పరిస్థితి తెచ్చుకున్నాం. వాస్తవానికి సూర్యరశ్మి ఆధారంగా, గాలి మరల ద్వారా కూడా విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చునని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. మన దేశంలో 8 వేల కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. ఈ తీరంలో సముద్ర అలల ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చు. ప్రత్యామ్నాయాలు ఉండగా ప్రపంచ వాతావరణము వేడెక్కి అత్యవసర పరిస్థితి ఎందుకు తెచ్చు కుంటున్నామో ఆలోచించాలి. ప్రస్తుత పరిస్థితి నుండి వాతావరణం చల్లబడేలా చర్యలు చేపట్టాలి.

2014 నుండి ప్రతి సెకనుకు వెయ్యి టన్నుల వంతున ప్రాణ వాయువు తగ్గిపోతోందనీ, ప్రాణ వాయువు ఉత్పత్తి పెరిగేందుకు అవసరమైన కృషి చేయాలనీ, ప్రస్తుతం వాతావరణంలో 23.5 శాతం నుండి ప్రాణ వాయువు శాతం 20.9 శాతానికి చేరుకుందనీ, ఇది 19.5 శాతం కన్నా తగ్గితే జీవావరణం మనగలగడం చాలా కష్టం అని ఎంత మంది శాస్త్రవేత్తలు చెప్పిన మనం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం లేదనేది సత్యం.

2016 పారిస్ ఒప్పందంలో సైతం శాస్త్రవేత్తలు వాతావరణం చల్లబడటానికి అవసరమైన చర్యలు చేపట్టాలనీ, వాతావరణం వేడెక్కడాన్ని తగ్గించాలనీ, కర్బన ఉద్గారాలు తగ్గించాలనీ, లేకుంటే పెను ముప్పు ఏర్పడుతుందనీ హెచ్చరించారు. ఈ ఒప్పందం మీద 175 దేశాలు సంతకం పెట్టి అమలు చేస్తామన్నాయి. కానీ ఆచరణలో అంతంత మాత్రంగానే ఉంది.భూమిలో ఇంధన రూపంలో మగ్గుతున్న కార్బన్ నిల్వలను వెలికి తీసి వాయు రూపంలోని కార్బన్ డయాక్సైడ్‌గా మార్చివేస్తున్నాం. ఇది వాతావరణాన్ని వేడెక్కించేసి ప్రపంచంలో పెనుమార్పులు తెస్తోంది.

160 కు పైగా దేశాలకు చెందిన దాదాపు పన్నెండు వేల మంది శాస్త్రవేత్తలు ప్రస్తుతం ప్రపంచం వాతావరణ అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా రానున్న పరిస్థితులను దృష్టిలోనికి తీసుకుని 2019 మే 1వ తేదీన బ్రిటన్ మొదటగా ప్రపంచ వాతావరణ అత్యవసర పరిస్థితి ఏర్పడిందని ప్రకటించింది. వాతావరణం వేడెక్కిపోవడం వల్ల విభిన్న జీవజాతులు అయిదు శాతం తగ్గి పోయాయనీ ఇదే విధంగా కొనసాగితే ఇంకా అధిక మొత్తంలో తగ్గిపోయే ప్రమాదం ఉందని ముందస్తు హెచ్చరికలు చేసిన కుడా పరిస్థితిని చక్కబెట్టడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేయడం లేదు.

పారిశ్రామికీకరణకు ముందు రోజులతో పోలిస్తే రెండు డిగ్రీల సెల్సియస్ కు మించి ప్రపంచ ఉష్ణోగ్రత పెరగకుండా చూసుకోవాలన్నది లక్ష్యంగా ప్యారిస్ లో జరిగిన కాఫ్ 2021లో ప్రపంచ దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. వరుసగా పెరుగుతున్న వాతావరణ పరిస్థితుల ఘటనలు ప్రపంచం మొత్తాన్ని అప్రమత్తం చేశాయి. ఫలితంగా పర్యావరణ ప్రభావంతో భూగోళం రోజురోజుకు భయాందోళన కలిగించే దిశగా పయనిస్తున్నదని పర్యావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రమాదకర స్థాయికి చేరిందనీ 1850 నుండి1900 మధ్య కాలం కన్నా ఇపుడు ప్రతి రోజు కనీసం ఒక డిగ్రీ అధికంగా ఉందనీ పరిశోధకులు తేల్చారు.

ఈ వాతావరణ అత్యవసర పరిస్థితి నుండి బయట పడటానికి కర్బన ఉద్గారాలు సమూలంగా తగ్గించు కోవాలని ఐక్యరాజ్య సమితి పేర్కొంటోంది. అందుకు అవసరమైన అవగాహన అందరిలో కలిగించాలనీ, శిలాజ ఇంధనాలను తగ్గించుకోవడానికి తప్పనిసరిగా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు ప్రకటించారు. భూమిని మరణం వైపు కాకుండా జీవావరణంతో కళకళలాడే విధంగా చూడాలని ఇందుకు ప్రపంచ వ్యాప్తంగా అన్ని నగరాల్లోను ప్రజల్లోను కదలిక రావాలని, ప్రస్తుతం నగరాలు ఎదుర్కొంటున్న అత్యవసర పరిస్థితి మిగిలిన ప్రాంతాలకు పాకక ముందే ప్రతి ఒక్కరూ స్పందించి,యుద్ధ ప్రాతిపదికన వాతావరణం చల్లబడేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు అన్ని నగరాల్లో చేయవలసిన పరిస్థితి మన ముందుంది.

స్వలాభం, అభివృద్ధి పేరుతో పర్యావరణ విధ్వంసాన్ని సృష్టించడంలో పోటీని ఆపి, పర్యావరణ హితంగా అభివృద్ధి పనులు చేపట్టి, తక్షణమే వాతావరణం చల్లబడటానికి అవసరమైన అన్ని ప్రయత్నాలూ చేయాలి.ఇంతటి విపత్తు గురించి అందరికీ తెలియచేయడం కొరకు జరుపుకొనేజాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తూ, ఇంధన పరిరక్షణ అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి చిన్ననాటి నుండి విద్యార్థులకు అవగాహన కల్పించాలి. 1991వ సంవత్సరం నుండి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం

జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం డిసెంబరు 14వ తేదీన జరుగుతున్నందున

ఆ రోజు ఇంధన పరిరక్షణకు కృషి చేసిన వివిధ పరిశ్రమలు, కంపెనీల ఇండస్ట్రియల్ యూనిట్లకు, హెూటళ్ళకు, ఆసుపత్రి భవనాలకు, కార్యాలయాలకు, షాపింగ్ మాల్ బిల్డింగులకు, జోనల్ రైల్వే, రాష్ట్ర సంబంధ ఏజెన్సీలు, మున్సిపాలిటీలు, థర్మల్ పవర్ స్టేషన్లకు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు అందజేస్తున్నారు.కావునా ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమిస్తూ పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా చేయూత నివ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది.

గడప రఘుపతిరావు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయఅవార్డ్ గ్రహీత.

9963499282



# ధన్వంతరి మహర్షి ఆరోగ్య సూత్రాలు

సనాతన హిందూ పురాణాలలో ధన్వంతరి మహర్షిని ఆయుర్వేద దైవంగా, వైద్య పితామహుడుగా పరిగణిస్తారు. ఆ మహనీయుని విష్ణువు యొక్క అవతారంగానూ భావిస్తారు. అంతేకాక సముద్ర మథనంలో అమృత భాండంతో సహా ధన్వంతరి మహర్షి ఉద్భ వించినట్లు పురాణాలు చెబుతు న్నాయి. ఆయనను ఆరోగ్యప్రదాతగా పూజిస్తారు. ఆయన ఆయు ర్వేద నిర్మాతగా భావిస్తారు. సమ స్త మానవాళికి ఆ మహర్షి బోధించిన ఆరోగ్య సూత్రాలను తెలుసు కుందాం.

అజీర్ణే భోజనం విషం.

గతంలో తీసుకున్న భోజనం జీర్ణం కాకపోతే.. రాత్రి భోజనం తీసుకోవడం విషం తీసుకున్నట్లు అవుతుంది. ఆకలి అనేది మునుపటి ఆహారం జీర్ణమైందని సూచించే ఒక సంకేతం

అర్ధరోగహరి నిద్ర.

సరైన నిద్ర సగం వ్యాధులను నయం చేస్తుంది..

ముద్గదాలి గదవ్యాలి.

అన్ని పప్పుధాన్యాలలో, పచ్చ పెసర్లు ఉత్తమమైనవి. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇతర పప్పుధాన్యాలు అన్నీ ఒకటి లేదా మరొక దుష్ప్రభావాలను కలిగి ఉంటాయి.

భగ్నాస్థి-సంధానకరో లశునః.

వెల్లుల్లి విరిగిన ఎముకలను కూడా కలుపుతుంది..

అతి సర్వత్ర వర్జయేత్.

రుచిగా ఉన్నంత మాత్రాన ఏదైనా అతిగా తీసుకుంటే అది ఆరోగ్యానికి మంచిది కాదు. మితంగా ఉండండి.

నాస్తి మూలమనౌషధం.

శరీరానికి ఔషధ ప్రయోజనం లేని కూరగాయలు లేవు.

న వైద్యః ప్రభురాయుషః ?

ఏ వైద్యుడూ దీర్ఘాయువు ఇవ్వలేడు. (వైద్యులకు పరిమితులు ఉన్నాయి.)

చింతా వ్యాధి ప్రకాశాయ ?

ఆందోళన అనారోగ్యాన్ని తీవ్రతరం చేస్తుంది..

వ్యామశ్చ శనైః శనైః.

ఏదైనా వ్యాయామం నెమ్మదిగా చేయండి. (వేగవంతమైన వ్యాయామం మంచిది కాదు.)

అజవత్ చర్వణం కుర్యాత్.

మీ ఆహారాన్ని మేక లాగా నమలండి. (ఎప్పుడూ తొందరపడి ఆహారాన్ని మింగకండి. లాలాజలం జీర్ణక్రియలో మొదట సహాయపడుతుంది.)

స్నానం నామం మనఃప్రసాధనకరందుః స్వప్న-విధ్వంసనం ?

స్నానం కుంగుబాటు (డిప్రెషన్) ను దూరం చేస్తుంది.

చెడు కలలను దూరం చేస్తుంది..

న స్నానమాచరేద్ భుక్త్వా.

ఆహారం తీసుకున్న వెంటనే స్నానం చేయకూడదు. (జీర్ణక్రియ ప్రభావితమవుతుంది).

నాస్తి మేఘసమం తోయం.

స్వచ్ఛతలో వర్షపు నీటికి ఏ నీరు సరిపోదు..



అజీర్ణే భేషజం వారి.

అజీర్ణం ఉన్నప్పుడం సాధారణ నీటిని తీసుకోవడం వల్ల ఔషధంలా పనిచేస్తుంది.

సర్వత్ర నూతనం షష్టం, సేవకాన్నే పురాతనే ?

ఎప్పుడూ తాజాగా ఉండేవాటికే ప్రాధాన్యత ఇవ్వండి..

అయితే అన్నం మరియు సేవకుడు మాత్రం పెద్ద వయస్సులో ఉన్నప్పుడు మాత్రమే మంచివి.

నిత్యం సర్వ రస భక్ష్యః ??

మొత్తం షడ్రుచులు (ఆరు) రుచులు ఉన్న ఆహారాన్ని తీసుకోండి.

(అనగా: ఉప్పు, తీపి, చేదు, పులుపు, వగరు (ఆస్ట్రింజెంట్) మరియు ఘాటు (పంజెంట్).

జఠరం పూరాయెదర్ధం అన్నార్, భాగం జలేన్ చ ? లివాయోః సంచరణార్థాయ చతర్థమవశేషయేత్ ??

మీ కడుపులో సగభాగాన్ని ఘనపదార్థాలతో నింపండి, పావు వంతు నీరు మరియు మిగిలిన దానిని ఖాళీగా ఉంచండి.

భుక్త్వా శతపథం గచ్ఛేద్ యదిచ్ఛేత్ చిరజీవితమ్ ?

ఆహారం తీసుకున్న తర్వాత ఎప్పుడూ ఖాళీగా కూర్చోవద్దు. కనీసం అరగంట పాటు నడవండి.

క్షుత్స్వాధుతాం జనయతి ?

ఆకలి ఆహారం యొక్క రుచిని పెంచుతుంది..

ఇంకా చెప్పాలంటే, ఆకలిగా ఉన్నప్పుడే తినండి..

చింతా జరా నామం మనుష్యాణాంలి


ఆందోళన వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది..

శతం విహాయ భోక్తవ్యం?

ఆహారం కోసం సమయం వచ్చినప్పుడు, 100 పనులను కూడా పక్కన పెట్టండి (ఫోనుతో సహా).

సర్వధర్మేషు మధ్యమామ్.

ఎల్లప్పుడూ మధ్య మార్గాన్ని ఎంచుకోండి. ఏదైనా విషయంలో...



"అందరి ఆరోగ్యాభిలాషి"

చౌదూరి నరసింహారావు

పత్రికారచయిత, సామాజిక విశ్లేషకులు

# జీవితంలో క్రీడలది కీలక భూమిక: ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 29:ఒకరి వ్యక్తిత్వాన్ని రూపొంది ంచడంలో, సృజనాత్మకత, శ్రేయస్సులను పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని వరల్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అలయన్స్ బోర్డు డైరెక్టర్, గ్లోబల్ కమ్యూనిటీ హెల్త్ టెక్నికల్ హెడ్ ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్ డైరెక్టరేట్, గస్టో-2025-26 పేరిట నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్-విశ్వవిద్యాలయ, అంతర్-కళాశాల క్రీడా పోటీలను బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని పలు విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి వచ్చిన యువ క్రీడాకారులను ఉద్దేశించిన ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ, 'ఆట ఉద్యోగం కోసం కాదుబీ ఇది వినోదం, ఉత్తేజం, పునర్జీవనం కోసం' అన్నారు. విద్యార్థులు తమ ఆసక్తి, అభిరుచి అనుగుణంగా ఎంపిక చేసుకుని, జీవితాన్ని కొనసాగించాలని ఆయన ప్రోత్సహించారు. క్రీడలలో పాల్గొనడం వల్ల అభ్యాసం, జ్ఞాపకశక్తి, ఉపాధి అవకాశాలు ఎలా పెరుగుతాయో ఆయన పలు అంతర్జాతీయ, జాతీయ ఉదంతాలను ఉటంకిస్తూ చెప్పారు. విద్యతో పాటు పాఠ్యేతర కార్యకలాపాలలో పాల్గొన్న విద్యార్థులు రాణించిన ఉదాహరణలను ఆయన వివరించారు.ముఖ్య అతిథిగా క్రీడా పోటీలను ప్రారంభించిన ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డిని గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి సత్కరించారు.గస్టో-2025-26లో క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, ఫుట్ బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, త్రోబాల్, బాస్కెట్ బాల్ వంటి ఉత్కంఠభరితమైన క్రీడా పోటీలుంటాయి. ఈ పోటీలలో సిద్ధార్థ, ఎంజీఐటీ, ఎంఎల్ఆర్డీ, భవన్స్ లయోలా అకాడమీ, మహీంద్రా, ఎన్ఐసీఎంఏఆర్, కేఎల్ యూ-హెచ్, వీఎన్ఆర్ వీజేఐటీ లతో పాటు గీతం వంటి ప్రఖ్యాత సంస్థల జట్లు పోటీపడుతున్నాయి. ప్రాంగణాన్ని నైపుణ్యం, సంకల్పం, క్రీడా స్ఫూర్తి యొక్క శక్తివంతమైన వేదికగా మారుస్తున్నాయి. మూడు రోజుల పాటు ఉత్కంఠభరితంగా, స్నేహపూర్వక జరిగే ఈ పోటీలు గస్టో యొక్క నిజమైన స్ఫూర్తిని, ఆట, అభిరుచి, పట్టుదలను ప్రతింబింబిస్తున్నాయి.

# రామ్ సాగర్ రెండవ దశ కాలువకు బి యన్ రెడ్డి పేరు పెట్టాలి: ఎం సి పి ఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 29: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ బి.యన్.రెడ్డి పేరును శ్రీరామ్ సాగర్ రెండవ దశ కాలువకు పెట్టాలని ఎం సి పి ఐ (యు)రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి డిమాండ్ చేశారు.కృష్ణ గోదావరి నది జలాల అను సంధానకర్త భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత సామాజిక న్యాయ రథసారథి విప్లవాల ఎర్ర సూర్యుడు కరివిరాల కొత్తగూడెం ఎర్రజెండా ముద్దుబిడ్డ శ్రీరాంసాగర్ రెండవ దశ సాధన సాధించిన పోరాటాల భీముడు ఎం సి పి ఐ (యు) పోలిటి బ్యూరో సభ్యులు అమర జీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి మాజీ పార్లమెంట్ సభ్యులు మాత్రమే అర్హులు అని తెలిపారు.బుధవారం యంసిపిఐ(యు) సూర్యాపేట జిల్లా కమిటీ సమావేశం కామ్రేడ్ ఏపూరి సోమన్న అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ




బి.యన్ రెడ్డి సాయుధ పోరాటం నుండి మొదలుకొని రెండుసార్లు ఎమ్మెల్యేగా మూడుసార్లు ఎంపీగా 25 సంవత్సరాలు ప్రజా ప్రతినిధిగా ఎన్నికై చట్టసభలలో ప్రజల పక్షాన ప్రాతినిధ్యం వహించి తన యొక్క కంచు కంఠాన్ని అసెంబ్లీ పార్లమెంటులో వినిపించి ప్రజలకు సాగునీరు తాగునీరు అందించాలని పరితపించి ప్రజా ఉద్యమాలను నిర్మించి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టించి కాల్వ కోసం బడ్జెట్ కేటాయింపు చేసి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి చే కాలువను సర్వే చేయించి అధికారులతో చర్చలు జరిపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 1996 మార్చి ఆరో తారీఖున ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మిర్యాలగూడ ఎంపీగా ఉన్న బి.యన్.రెడ్డి స్వయంగా దగ్గర ఉండి తుంగతుర్తి నియోజకవర్గ తిరుమలగిరి మండల ప్రగతి నగర్ పనిగిరి వద్ద స్వయంగా దగ్గర ఉండి కాలువకు శంకుస్థాపన చేయించిన వీరుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి,1999 సంవత్సరము దామోదర్ రెడ్డి శిలాఫలకం వద్ద రక్త తర్పణం చేశారని వెంకన్న గుర్తు చేశారు ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రులతో నీటిపారుదల శాఖ మంత్రులు కడియం శ్రీహరి ,పొన్నాల లక్ష్మయ్య గార్లతో అనేకసార్లు చర్చలు జరిపి ఉత్తరాలు రాసి మైలారం స్టేజి వద్ద మండుటెండలు సదస్సులు రాస్తారోకోలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి గోదావరి నీరు చూసి తీరుతానని పరితపించి 2008 మే 9 వ తేదీన మరణించారని మే 16న సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన బి.ఎన్.రెడ్డి సంతాప సభలో ఆనాటి హెూంశాఖ మంత్రి జానారెడ్డి మాజీ మంత్రి దామోదర్ రెడ్డి ప్రభుత్వం తరపున ఎస్సారెస్పీ కాలువకి బి.యన్ రెడ్డి పేరు పెడతామని ప్రకటించిన విషయం ప్రజలు మర్చిపోలేదని గాదగోని రవి గుర్తు చేశారు.

గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో అనేకసార్లు ఉమ్మడి జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి కి తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్ కి కాలువకు భీమిరెడ్డి పేరు పెట్టాలని వినతిపత్రాలు ఇవ్వటం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు బి.యన్.రెడ్డి వర్ధంతి సభలో హాజరై అసెంబ్లీలో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి శ్రీరామ్ సాగర్ రెండవ కాలువకు భీమిరెడ్డి పేరు పెట్టిస్తానని హామీ ఇచ్చారని వెంకన్న తెలిపారు

రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి దినకర్మలకు వచ్చిన ముఖ్యమంత్రి తొందరపడి కాలువకు దామోదర్ రెడ్డి పేరు ప్రకటించారని పునర్ ఆలోచించి ఆ ప్రకటనను వెనక్కి తీసుకొని శ్రీరామ్ సాగర్ రెండవ దశ కాలువకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు నామకరణం చేయాలని ప్రభుత్వానికి గాదగోని రవి విజ్ఞప్తి చేశారు . అలాగె సూర్యాపేట జిల్లా కు బి యన్ పేరు పెట్టాలని, ట్యాంక్ బండ్ పై కామ్రేడ్ బి యన్ విగ్రహం పెట్టాలని, హైదరాబాద్ లో బి యన్ గారి స్మారక విజ్ఞాన కేంద్రం నిర్మాణం చేయాలని, తెలంగాణ కే వన్నె తెచ్చిన మహానుభావుడు కామ్రేడ్ బి యన్ పేరు భవిష్యత్ తరాలకు అందించటానికి, పాఠ్యాంశాల లో బి యన్ చరిత్ర చేర్చాలని అపుడు మాత్రమే ఈ ప్రభుత్వంలకు ఒక సార్థకత ఉంటుంది అని అన్నారు.ఈ సమావేశం లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్స్ వల్లెపు ఉపెందర్ రెడ్డి,వరికుప్పల వెంకన్న, జిల్లా కార్యదర్శి యస్ కే నజీర్, జిల్లా నాయకులు నల్లూరి రమేష్, లింగం పల్లి రాజు, మారపాక ఉగ్రయ్య, బచ్చు కోటయ్య, లింగం పల్లి ఓంకార్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలి: కలెక్టర్ పి.ప్రావీణ్య

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, అక్టోబర్ 29 :ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి జిల్లాలో "ఆయిల్ పామ్ పంట అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొన్నారు. ఆయిల్ పామ్ పంట ఆర్థికంగా లాభదాయకం. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఈ పంట విస్తరణకు రైతులు ముందుకు రావాలి. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, ప్రోత్సాహక పథకాలు రైతులకు ఎంతో మేలు చేస్తాయి అని పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అధికారులు ప్రతి మండలంలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన భూభాగాలను గుర్తించాలి. రైతులకు తగిన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.పి.ఎ.సి.ఎస్.సెక్రటరీ లు గ్రామస్థాయిలో రైతులను చైతన్యపరచడం లో కీలకపాత్ర పోషించాలి అని సూచించారు.ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, సహకార సంఘాల ప్రతినిధులు, రైతులు, పి.ఎ.సి.ఎస్. సెక్రటరీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్ విధానం మంచి కార్యక్రమం. అద్భుతం, దేశానికే ఆదర్శనీయం.



వై ఎస్ ఆర్ కడప,అక్టోబర్ 29 (భారత శక్తి) : సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ నిర్వహణ అద్భుతంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మరింత బాగుందని దేశానికే ఆదర్శవంతంగా ఉన్నాయని.. నీతీ ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ మరియు వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్దార్థ్ జైన్ సంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా పర్యటన లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోకలిసి రాష్ట్రానికే ఆదర్శవంతంగా నిర్మించి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న సి.కె.దిన్నె జెడ్పీ హైస్కూలులోని సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ను నీతి ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆకాంక్షిత జిల్లా,ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధిలో భాగంగా జిల్లా కలెక్టర్ వినూత్న ఆలోచనతో పైలెట్ ప్రాజెక్టుగా అమలులోకి తీసుకొచ్చిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్వహణ గురించి ప్రాబరీ అధికారికి వివరిస్తూ దేశంలోనే తొలిసారిగా సికె దిన్నె ఎంపిపి పాఠశాల ఆవరణ లో రూ.56 లక్షల తో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ డ్ స్మార్ట్ కిచెన్ ద్వారా ప్రతిరోజు చుట్టుపక్కల గ్రామాల్లోని 33 పాఠశాలల్లోని 1758 మంది విద్యార్థులకు శుచికరమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందివ్వడం జరుగుతుందన్నారు. డిసెంబర్ చివరి నాటికల్లా కడప జిల్లాలోని 11 మండలాల్లో 33 స్మార్ట్ కిచెన్ల ద్వారా 1,24,689 మంది విద్యార్థులకు రుచి, శుచికరమైన ఆహారాన్ని అందిస్తామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం సికే దిన్నె 2, జమ్మలమడుగు 2, కడపలో 1 స్మార్ట్ కిచెన్ ల ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు 13 ప్రత్యేక వాహనాల్లో ఆహారాన్ని పంపేలా చర్యలు చేపడుతున్నామన్నారు.

న్యూట్రిషనిస్ట్ పర్యవేక్షణలో సోలార్ పవర్ తో పనిచేసే ఈ స్మార్ట్ కిచెన్ లో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నామన్నారు.

మెరుగైన నాణ్యత కోసం ఇక్కడ ప్రత్యేక ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటు నీటినే వంటకు ఉపయోగించడం జరుగుతోందన్నారు.

ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్ ను సందర్శించిన నీతి ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ వంటకు సంబంధించిన అన్ని ప్రక్రియలను,సరుకుల నాణ్యత, భోజనం తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆర్ఓ ప్లాంటు, ఆహార పంపిణీ వాహనాలను కూడా ప్రాబరీ అధికారి సిద్ధార్థ జైన్ క్షుణ్ణంగా పరిశీలించారు.

వంట నిర్వాహకులను పలకరించగా ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం శుచి, రుచితో కూడిన భోజనాన్ని నిర్ణీత సమయానికి తాము అందించ గలుగుతున్నామని, అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సులభంగా వంటను పూర్తి చేయగలుగుతున్నామని వంట సిబ్బంది తెలపడంతో జాయింట్ సెక్రెటరీ సంతోషాన్ని, సంతృప్తి ని వ్యక్తం చేసారు.

సికె దిన్నె స్కూలు స్మార్ట్ కిచెన్ పనితీరు అద్భుతంగా ఉందని, రాష్ట్రానికే కాదు.దేశానికే ఆదర్శంగా స్మార్ట్ కిచెన్ విధానం ను రూపొందించారని. జిల్లా కలెక్టర్ ను ప్రాబరీ అధికారి అభినందించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజల అభివృద్ధికి బాటలు వేస్తున్నాయని సంక్షేమ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో జిల్లా యంత్రాంగం, సంబందిత అధికారుల సేవలు ప్రశంసనీయమని జాయింట్ సెక్రెటరీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిపి నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, విద్యాశాఖ ఆర్జెడి శామ్యూల్, డీఈవో శంశుద్దిన్, హౌసింగ్ పీడి రాజరత్నం,సమగ్ర శిక్ష ఏపీసి ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కంటి శస్త్ర చికిత్స శిబిరం విజయవంతం



ములుగు జిల్లా ప్రతినిధి,(ఏటూరు నాగారం) అక్టోబర్ 29 (భారత శక్తి): ములుగు జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పొర శస్త్ర చికిత్స శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ పి. హాజరై భాగస్వామ్యమైన సినీనటుడు సంజోష్ ను అభినందించారు.

సంజోష్ ఫౌండేషన్, శంకర నేత్రాలయ మెసు హైదరాబాద్ విజన్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ ఫౌండర్ రాచుపల్లి ఉపేంద్ర సహకారంతో ఈ శిబిరాన్ని ములుగు జిల్లా,ఏటూరునాగారం మండలంలోని గిరిజన భవన్ లో నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా ప్రజలు విస్తృతంగా స్పందించి, దాదాపు వెయ్యి మంది ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నారు. అందులో 168 మంది రోగులకు విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తన స్వస్థల ప్రజల కోసం సంజోష్ ఇంత విలువైన సేవా కార్యక్రమం చేపట్టడం నిజంగాప్రశంసనీయంప్రస్తుతం చాలామంది తమ ఊరిని మరిచిపోతున్న వేళ, సంజోష్ లాంటి యువత తమ ప్రజల కోసం కృషి చేయడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అనంతరం ఎస్పీ శంకర నేత్రాలయ వైద్యులను శాలువాలతో సత్కరించి, ఆశ వర్కర్లకు రూ.15 వేల చెక్కును సంజోష్, రాచుపల్లి ఉపేంద్ర చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ ఐపీఎస్, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ శంకర్, సి.ఐ ఏటూరు నాగారం అనుముల శ్రీనివాస్, ఏటూరు నాగారం ఎస్.ఐ రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ 150 వ జయంతి సందర్భంగా కామారెడ్డిలో ఐక్యతా యాత్ర



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 29: ఈ నెల అక్టోబర్ 31 తేదీన భారత మాజీ హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఐకృత యాత్ర (యూనిటీ ర్యాలీ) నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు ప్రకటనలో తెలియజేశారు.స్వాతంత్రం అనంతరం తెలంగాణాతో పాటు అనేక సంస్థానాలను భారత దేశంలో విలీనం కావడానికి ఆద్యుడు అయిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31 వ తేదీన ఉదయం 7 గంటలకు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం నుండి జన్మభూమి రోడ్డులోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు లిఐక్యతా యాత్రలి నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కావున యువకులు జాతీయవాదులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు విపుల్ జైన్, అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్ రెడ్డి, బిజెవైఎమ్ అధ్యక్షుడు నంది వేణులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, అక్టోబర్ 29(భారతశక్తి ప్రతినిధి):తుఫాన్ నేపథ్యంల జిల్లాలో 2 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అక్టోబర్ 29, 30 తేదీలలో వర్షాలు ఉండే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వనరులలో నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు.జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఎవరు చేపలు పట్టడానికి వెళ్ళవద్దని సూచించారు. కల్వర్టులు దాటువద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అత్యవసమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వరద ప్రభావిత ప్రజలకు నెస్లే సంస్థ నుంచి నిత్యావసర కిట్ల అందజేత

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (భారత శక్తి): భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు సాయంగా నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను నెస్లే సంస్థ తరఫున జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో అందజేశారు.



జిల్లాలో వరదల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు సాయం అందించాలనే ఉద్దేశంతో నెస్లే సంస్థ మొత్తం 600 నిత్యావసర సరుకుల కిట్లను అందజేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ కిట్లు వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని కలెక్టర్ అన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన నెస్లే సంస్థ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.

# మరింత పురోగతి సాధించేందుకు సమిష్టిగా కృషి చేయండి:

## నీతి ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ మరియు ఆకాంక్షిత జిల్లా ప్రాబరి అధికారి

వైయస్సార్ కడప జిల్లా, అక్టోబర్ 29(భారత శక్తి): ఆకాంక్షిత జిల్లాల ప్రగతిలో వైయస్సార్ కడప జిల్లా మరింత పురోగతి సాధించేందుకు సమిష్టి కృషితో ముందుకు వెళ్లాలని నీతి ఆయోగ్ సెక్రెటరీ జాయింట్ సెక్రెటరీ మరియు ఆకాంక్షిత జిల్లా ప్రాబరి అధికారి సిద్ధార్థ జైన్ పేర్కొన్నారు.బుధవారం జిల్లా సచివాలయంలోని బోర్డ్ రూమ్ నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తో కలిసి వై ఎస్ ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా మరియు ఆకాంక్షిత బ్లాక్ ప్రోగ్రాం ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రెటరీ మాట్లాడుతూ 2025 మార్చి నాటికి 73.6 స్కోరు సాధించి టాప్ 5 జిల్లాలలో వైయస్సార్ కడప జిల్లా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గారిని అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యము, పౌష్టికాహారము, విద్యా, వ్యవసాయం మరియు నీటి వనరులు, ఆర్థిక స్వాలంబన & నైపుణ్యాభివృద్ధి,కనీస మౌలిక సదుపాయాలు విభాగాలలో సంబంధిత అధికారులు వినూత్నంగా ఆలోచించి వాటి తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేక దృష్టిసారిం చాలన్నారు.ప్రతి అధికారి వారి అనుభవం తో వినూత్న పద్ధతులతో శాఖల ప్రగతికి పని చేయాలన్నారు. ఉదాహరణకు విద్యారంగానికి




సంబంధించి కడప జిల్లాలో అమలవుతున్న స్మార్ట్ కిచెన్ విధానం అద్భుతంగా ఉందని అలాగే ప్రతి విభాగంలోనూ వినూత్న ఆలోచనలతో ప్రగతి సాధన దిశగా పని చేయాలన్నారు.వైద్యానికి సంబంధించి గర్భవతులలో రక్తహీనత నివారణకు తీసుకోవలసిన చర్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. బరువు తక్కువ గల పిల్లల పెరుగుదల కు తల్లిదండ్రులకు తగు సూచనలు ఇవ్వడం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేలా సూచించాలన్నారు.పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలలో శుద్ధమైన తాగునీరు అందించాలన్నారు. నీటి వసతి తో కూడిన మరుగుదొడ్ల ఏర్పాటు ద్వారా సత్ఫలితాలు ఉంటాయన్నారు.భూగర్భ జలాల పెంపునకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ కు లక్ష్యాన్ని నిర్దేశించి లక్ష్యసాధనకు చర్యలు చేపట్టాలన్నారు.జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి వివరిస్తూ జిల్లా లో సామాజిక స్థాయిని (అభివృద్ధి) ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మని,ప్రతి మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరానికి ఒకసారి 5 అంశాలకు సంబంధించి కీ పారామీటర్ ఇండికేట్ (కెపిఐ) పాయింట్ల ఆధారంగా ప్రగతిని లెక్కించడం జరుగుతుందన్నారు. అందులో ముఖ్యంగా హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్ -నైపుణ్యాభివృద్ధి, గృహ నిర్మాణం, వ్యవసాయం, పశు పోషణ, మౌలిక సదుపాయాలు మొదలైన శాఖల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో మరింత పురోగతి సాధనకు కృషి చేస్తున్నామన్నారు.అందు కోసం సంబందిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆ మేరకు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.ఈ సమావేశంలో భాగంగా జాయింట్ సెక్రెటరీ గారిని జిల్లా కలెక్టర్ సన్మానించి సత్కరించారు.ఈ సమావేశంలో సిపిఓ హాజరతయ్య, డీఈవో షంషుద్దీన్, డి ఆర్ డి ఏ పిడి రాజ్యలక్ష్మి ,హౌసింగ్ పిడి రాజా రత్నం,డిఎం & హెచ్ ఓ డా.నాగరాజు,ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారులు నిజాం రజాకార్ల వారసులుగా వ్యవహరిస్తున్నారు : సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 29: మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్ గ్రామంలో గత 50 సంవత్సరాలుగా కబ్జాలో ఉన్న భూములకు వారికే హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కే. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005కు ముందు కబ్జాలో ఎవరైతే ఉన్నారో తెలంగాణ ప్రభుత్వం వారందరికీ హక్కు పత్రాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, అయితే ఫారెస్ట్ అధికారులు పంట పొలాలను ధ్వంసం చేస్తూ, బోరుబావులను బోరు పంపు సెట్లను పైప్లైన్లను పీకి వేస్తూ, అరాచకమైన పద్ధతిలో నిజాం రజాకార్లకు వారసులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోడు రైతుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుంటే ఫారెస్ట్ అధికారులు పోడు రైతులను ఇబ్బందుల గురి చేస్తూ ఆత్మహత్యలకు పాల్పడే విధంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని, వారు తీరు మార్చుకోకపోతే ఫారెస్ట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనికి ప్రధానంగా కాంగ్రెస్ నాయకులు బాధ్యత వహించాలని ఇక్కడున్న షబ్బీర్ అలీ నర్సింగ్ రావులు బాధ్యత తీసుకొని సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జి. రమేష్, నర్సింలు, నగేష్, కోలపురం బాబు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 29: ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ హిందూస్తాన్ యూనిలివర్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు ను బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం జరిగింది.


ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎపిసి ఆదేశాల మేరకు ప్రతి వ్యవసాయ ప్రాథమిక సంఘానికి 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం ఇవ్వడం జరిగిందని, ఆయిల్ పామ్ పంట సాగు, నాటడం, చీడపీడల నివారణ చర్యలు , మార్కెటింగ్ గురించి ప్రతీ ఒక్క అంశం పై అవగాహన కలిగి ఉండాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అన్నారు.ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయ వనరుగా మారుతుందని, దీనిని శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టాలని సూచించారు. అలాగే, ఈ రంగంలో ప్రభుత్వం, సహకార సంఘాలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ పంట యొక్క ఆర్థిక




ప్రాధాన్యత, సాగు పద్ధతులు, నీటి వినియోగం, వాతావరణ అనుకూలత, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మార్కెట్ అవకాశాలపై సంబంధిత అధికారులు విశదీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. మోహన్ రెడ్డి, జిల్లా కోపరేటివ్ అధికారి రామ్మోహన్, పిఎసిఎస్ కార్యదర్శులు, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యాన, ఉద్యాన విస్తరణ అధికారులు, ఆయిల్ పామ్ ప్రతినిధులు, డ్రిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## నేడు విద్యాసంస్థలకు సెలవు : జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 29 (భారత శక్తి) : జిల్లాలో కురుస్తున్న మొంథా తుపాను ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్య ంలో అధికారులు అప్రమత్తం గా ఉంటూ రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు, జిల్లా, మండల స్థాయి అధికారులు, తహసిల్దార్లతో జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల... రైతులకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయ, మార్కెటింగ్, రెవిన్యూ, డి ఆర్డీ ఓ సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.తుపాను ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన వరి ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట ధాన్యం వర్షానికి తడిసి నష్టపోకుండా రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. తుపాను ప్రభావం గురించి రైతులకు తెలియజేస్తూ, అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. రానున్న రెండు రోజుల పాటు వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని, వెంటవెంటనే ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులు వారి వారి పరిధిలోని చెరువులను నిత్యం పర్యవేక్షిస్తూ ఏదైనా అత్యవసర మరమ్మతులు ఉన్నచో యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు.భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అధికారులు కార్యస్థానంలో ఉంటూ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. వర్షాల దృష్ట్యా తక్షణ సహాయం కొరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 కు కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ, వర్షానికి, జలమాయమైయ్యే ప్రాంతాల సమస్య కు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ప్రజలు కూడా ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని అన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల మీదుగా వరద ప్రవాహం ఉన్న సమయాలలో రాకపోకలను నిషేధించాలని, చెరువులు, కాలువలు, నదులలో చేపల వేట, ఈత కోసం ఎవరూ వెళ్ళకుండా కట్టడి చేయాలన్నారు. వర్షాల వల్ల చెరువులు, కాలువ కట్టలు తెగి పోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాలలో ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తిస్తూ, అవసరమైన సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అక్కడికి తరలించి ఆహారం, ఇతర సదుపాయాలు సమకూర్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వర్షాలతో వరద జలాలు ఏర్పడి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఏమైనా అత్యవసర పరిస్థితులు ఉంటే తక్షణమే తన తీసుకురావాలన్నారు. మొంథా తుఫాను కారణంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు నేడు గురువారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు.అన్ని మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఈ అత్యవసర సమాచారాన్ని తమ పరిధిలోని పాఠశాలలకు, విద్యార్థులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకోగలరని కలెక్టర్ తెలిపారు.

# విజిలెన్స్ అవగాహన వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (భారత శక్తి) జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ . కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు సంబంధించి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 27 వ తేదీ నుంచి, నవంబర్ రెండవ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విజిలెన్స్ ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్స్ పెక్టర్ రవీందర్ సంతోషం, అసిస్టెంట్ జియాలజిస్ట్ వెంకట్ రెడ్డి లు పాల్గొన్నారు.

# స్టార్టప్ కడప" లక్ష్యం యువతకు స్ఫూర్తిదాయకం..!!


**-నీతీ ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ, వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్ధార్థ్ జైన్**

**-జిల్లా కలెక్టర్ తో కలిసి పి-4 "స్టార్టప్ కడప హబ్" సెంటర్ నిర్మాణ పనుల పరిశీలన**



కడప, అక్టోబర్ 29(భారత శక్తి) : ఉద్యోగం అందుకునే స్థాయి నుండి ఉద్యోగాలు అందించే స్థాయికి యువత ఎదగాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం యువతకు స్ఫూర్తిదాయకం అని.. నీతీ ఆయోగ్ జాయింట్ సెక్రెటరీ, వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్దార్థ్ జైన్ ప్రశంసించారు.బుధవారం కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న పి-4 "స్టార్టప్ కడప హబ్" సెంటర్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోకలిసి కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరీ అధికారి సిద్దార్థ్ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ.. ఆశించే స్థాయి నుండి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతిఇంటి నుండి ఒక స్టార్ట్ అప్ ఎదగాలనే ఆయన ఆలోచన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం అన్నారు. ఇలాంటి స్టార్ట్ ఆప్ కడప కార్యక్రమాన్ని ఆకాంక్ష జిల్లా కడపలో ప్రప్రథమంగా ఏర్పాటు కావడం అభినందనీయం అన్నారు. అధునాతన సదుపాయాలతో అన్ని రకాల మౌలిక వసతులతో రూపుదిద్దుకోనున్న కడప స్టార్ట్ అప్ కేంద్రం.. యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనుందన్నారుజిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. అత్యాధునిక వసతులతో రూ. 10 కోట్లు అంచనా వ్యయంతో స్టార్ట్ అప్ కడప సెంటర్ నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని స్టార్ట్ అప్ కడప హబ్ ను ముందుకు తీసుకువెళ్తామన్నారు. 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో %+%ం3 అంతస్తులతో, పిఈబి టెక్నాలజీ ఆధారంగా ఈ భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు గాను స్థానిక షిర్డీసాయి ఏక్ట్రికల్స్ రూ.4 కోట్లు విరాళం అందించనుందన్నారు. "స్టార్టప్ కడప" కేవలం ఒక భవనం మాత్రమే కాదని.. ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక అన్నారు. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా ఇది నిలవనుందన్నారు. కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి విజ్ఞాన, ఉద్యోగ, ఉపాధి వనరుగా ఉపయోగపడ నుందన్నారు. కడప జిల్లా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచే దిశగా.. "స్టార్ట్ అప్ కడప" పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన.. నిర్మాణ ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలను బిల్డింగ్ నమూనా మ్యాపు ద్వారా క్షుణ్ణంగా ప్రాబరీ అధికారికి వివరించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడి రాజరత్నం, ఆకాంక్షిత జిల్లా నోడల్. అధికారి జోయల్ విజయ్ కుమార్, సంబందిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అలా జరగకపోతే ఇండస్ట్రీ వదిలి వెళ్లిపోతా: రాజేంద్రప్రసాద్



'మాస్ జాతర' ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేయకపోతే తాను ఇండస్ట్రీ వదిలి వెళ్లిపోతానని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఆ వేడుకలో రాజేంద్రప్రసాద్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

"తెలుగు ప్రేక్షకులంటే నాకు ప్రాణం. చాలాకాలం తర్వాత అద్భుతమైన మాస్ సినిమా రానుంది. అదే 'మాస్ జాతర'. అన్ని భావోద్వేగాలు ఉన్న చిత్రమిది. ఈ సినిమాలో ఏముంది అనేది ఇప్పుడు మీతో పంచుకోను. ఎందుకంటే మీరు దాన్ని థియేటర్‌లోనే చూడాలి. ఈ సినిమా చూసి మీరు షాక్ అవకపోతే నేను సినిమా ఇండస్ట్రీ నుంచి వెళ్లిపోతాను.

'జులాయి', 'శ్రీమంతుడు', 'నాన్నకు ప్రేమతో'.. అంటూ అందరి హీరోలతోనూ పెద్ద హిట్ సినిమాలు చేశాను. ఇప్పుడు రవితేజతో ఈ చిత్రం చేశా. నాకోసం ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను రవితేజ రచయితతో అడిగిమరీ రాయించారు. ఇందులో నాకు అందరి కంటే శ్రీలీల పాత్ర నచ్చింది. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఈ చిత్రాన్ని మెచ్చుకుంటాయి" అని రాజేంద్రప్రసాద్ అన్నారు.

ఇక ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన కోలీవుడ్ హీరో సూర్యపై రాజేంద్రప్రసాద్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఎంతోమందిని చదివిస్తున్నారని, అది చాలా గొప్ప విషయమన్నారు. 48 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నానంటే అభిమానుల ప్రేమాభిమానాలతో పాటు గొప్ప రచయితలు కారణమన్నారు.




# బాహుబలి: ది ఎపిక్ ఆ సాంగ్స్, సీన్స్ 'కట్'

: 'బాహుబలి 1', 'బాహుబలి 2' ఈసారి ఒకే సినిమాగా రిలీజ్ కానున్నాయి. 'బాహుబలి: ది ఎపిక్' టైటిల్‌తో ఈ నెల 31న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా.. రాజమౌళి ప్రభాస్ , రానా ప్రత్యేక ఇంటర్వ్యూలో చిత్రీకరణ జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఎడిటింగ్‌లో భాగంగా తొలగించిన సీక్వెన్స్‌ల వివరాలను రాజమౌళి తెలిపారు. 'బాహుబలి: ది ఎపిక్' రన్‌టైమ్ 3:45 గంటలు అని చెప్పిన రాజమౌళి.. అవంతిక లవ్‌స్టోరీ, పచ్చబొట్టేసిన పాట, ఇరుక్కుపో సాంగ్, కన్నా నిదురించరా సాంగ్, యుద్ధానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను తొలగించామన్నారు. ఈ ఇంటర్వ్యూలోని పలు ఆసక్తికర సంగతులివీ..

రాజమౌళి: 'బాహుబలి'లోని పాత్రలకు మీరెప్పుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు?

రానా: ఓ మ్యాప్‌తో మీరు ఈ సినిమా కథను చెప్పిన రోజే ఇది నా కింగ్‌డమ్ అని ఫిక్స్ అయిపోయా. కిరీటంపై చేయి పెట్టి సీరియస్‌గా మాట్లాడే సన్నివేశంతో మరింత కనెక్ట్ అయ్యా.

ప్రభాస్: నాకు ఎప్పటిలాగే సెట్స్‌లో తొలి మూడు రోజులు టెన్షన్ ఉండేది. సేతుపతి తల నరికే సీన్ పూర్తయ్యాక 'డార్లింగ్.. నేను పాత్రలోకి వచ్చేశా' అని మీకు చెప్పా. తొలివారంలోనే దేవసేన ఎంట్రీ, కోర్టురూమ్, బహిష్కరణ సన్నివేశాలు పూర్తయ్యాయి. దాని వెంటే వచ్చే దండాలయ్యా సాంగ్‌ను మూడేళ్ల తర్వాత తీశాడు.

రాజమౌళి: కోర్టు సీన్‌కన్నా ముందు కర్నూలులో షూట్ చేశాం గుర్తుందా?

ప్రభాస్: 'జనం మధ్య నటించడం నేనెప్పుడో మానేశా. ఈయనొక్కడే నాతో ఇలాంటివన్నీ చేయించగలడు' అని అప్పుడే రానాతో చెప్పా. చుట్టూ జనం, పైగా వర్షం.. షూటింగ్ అవుతుందా, లేదా? అని మేమిద్దరం సందేహించాం. చివరకు మీరు అక్కడున్న వారందరితో హాయ్ చెప్పించారు.

రాజమౌళి: అవును. అద్భుతమైన షాట్ అది. "కర్నూలులో చిత్రీకరించిన జంప్ షాట్ ఒకటి చివరి వరకూ ఉన్నా ఎడిటింగ్‌లో పోయింది. అందుకే మళ్లీ అంతా రీషూట్ చేశాం. కానీ, అక్కడ రికార్డు చేసిన వాయిసే సినిమాలో వినియోగించాం. వార్ సీన్స్‌ను వరుసగా 70 రోజులపాటు చిత్రీకరించాం. కాలకేయుల పాత్రధారులు హోలీకి సెలవు ఇవ్వమని అడిగినా నో చెప్పా. ఎందుకంటే వాళ్ల మేకప్‌కే ఎక్కువ సమయం పట్టేది. చేసేదేం లేక నల్ల రంగుతోనే హోలీ ఆడారు (నవ్వుతూ)" అని రాజమౌళి తెలిపారు.

# చిరంజీవి సరసన మాళవికా మోహనన్ .. ఎట్టకేలకు స్పందించిన నటి



:

చిరంజీవి సినిమా ప్రకటించారంటే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఎన్నో వార్తలు నెట్టింట వైరల్ అవుతాయి. బాబీ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా ఓ సినిమా రానున్న సంగతి తెలిసిందే. ఇంకా పట్టాలెక్కని ఈ చిత్రంపై సోషల్ మీడియాలో వార్తలు మొదలయ్యాయి. ఇందులో ఆయన సరసన మాళవికా మోహనన్ నటించనున్నారంటూ జోరుగా ప్రచారం సాగింది. తాజాగా వాటిపై మాళవిక స్వయంగా స్పందించారు. ఆ రూమర్స్‌ను కొట్టిపారేశారు. "బాబీ దర్శకత్వంలో రానున్న మెగా 158 (వర్కింగ్ టైటిల్)లో నేను నటించనున్నట్లు సోషల్ మీడియాలో వచ్చే వార్తలు అవాస్తవం. నా కెరీర్‌లో ఒక్కసారైనా చిరంజీవి లాంటి అగ్ర కథానాయకుడితో నటించాలని కోరుకుంటున్నాను. ఆరోజు కోసం ఎదురుచూస్తున్నా. కానీ, ఈ ప్రాజెక్ట్‌లో నేను భాగం కాదు" అని స్పష్టతనిచ్చారు. దీంతో ఈ రూమర్స్‌కు తెరపడింది.

ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో 'మన శంకరవరప్రసాద్ గారు' ) రూపొందుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది విడుదల కానుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర' రానుంది. వీటితో పాటు శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో రెండు ప్రాజెక్ట్‌లు లైనప్‌లో ఉన్నాయి. ఇక మాళవిక 'ది రాజాసాబ్')తో పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# కుటుంబంతో సహా చనిపోదాం అనుకున్నా: సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో



జీవితం ఎవరికీ పూలబాట కాదు.. ఇండస్ట్రీలోని ఎంతోమంది వ్యక్తుల జీవితాలకు ఈ సామెత అద్దం పడుతుంది. తన పాటలతో, సంగీతంతో అందరినీ అలరించే సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో.. తాజాగా జరిగిన 'మాస్ జాతర' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడిన మాటలు అందరినీ కదిలించేస్తున్నాయి. ఒకప్పుడు అవకాశాలు లేక కుటుంబంతో సహా చనిపోదాం అనుకున్నట్లు ఆయన తెలిపారు. ఆ సమయంలో దేవుడిలా రవితేజ కాపాడాడని.. ఆయన లేకపోతే తాను లేనని తెలిపారు. ప్రస్తుతం భీమ్స్ మాటలు వైరల్ అవుతున్నాయి.

"నేను ఏ విషయాన్నైనా పాట రూపంలో తెలుపుతాను. ఒకసారి నా పరిస్థితిని తెలుపుతూ ఒక సెల్ఫీ వీడియో తీసుకున్నా.. అందులో నా భార్య పిల్లలు కూడా కనిపించేలా తీశాను. నేను ఎందుకు వీడియో తీస్తున్నానో అప్పుడు వాళ్లకు తెలియదు. ఇంటికి అద్దె ఎలా కట్టాలి, పిల్లల్ని ఎలా చదివించాలి, ఎలా బతకాలి అని ఆలోచిస్తూ ఆ వీడియో తీశాను. అప్పుడు చిట్టచివరి క్షణంలో నాకు ఒక ఫోన్ వచ్చింది. మీరు పీపుల్స్ మీడియా ఆఫీసుకు రావాలి అని.. ఆ కాల్ నా జీవితాన్ని మార్చేసింది "

"ఆ ఫోన్ రావడానికి ఒక్క క్షణం ముందు నా ఆలోచనలు ఎలా ఉన్నాయంటే.. ఈ భూమి మీద నాకు నూకలు చెల్లిపోయాయి. నాకు జీవితం లేదు. నా భార్యాపిల్లలకు కూడా జీవితం లేదు. అందరం కలిసి పైకి వెళ్లిపోదాం.. అని అనుకుంటున్నా. ఆ క్షణంలో నేను కొలిచే దేవుడి రూపంలో రవితేజ నుంచి ఫోన్ వచ్చింది. ఆయనంటే మాటల్లో చెప్పాలంటే ప్రేమ, పాటల్లో చెప్పాలంటే భక్తి. నేను ఈరోజు ఇక్కడ నిలబడి ఉన్నానంటే, రోజూ అన్నం తింటున్నానంటే ఆయనే కారణం. ఒక్క మాటలో చెప్పాలంటే నేను సజీవంగా ఉన్నానంటే రవితేజనే కారణం. ఆయన లాంటి వాళ్లు ఇండస్ట్రీలో ఉంటే నాలాంటి వాళ్లు ఎంతోమంది వస్తారు. ఎంతోమందికి ఆయన స్ఫూర్తి. అందుకే ఆయనంటే నాకు చాలా ఇష్టం" అని భీమ్స్ సిసిరోలియో ఎమోషనల్ అయ్యారు.

2012లో 'నువ్వానేనా'తో ఇండస్ట్రీకి వచ్చిన భీమ్స్ సిసిరోలియో.. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం'లో ఆయన స్వరపరిచిన 'గోదారిగట్టు మీద..' సాంగ్ రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. చిరంజీవి హీరోగా రానున్న 'మన శంకరవరప్రసాద్ గారు'కు కూడా భీమ్స్ స్వరాలు అందిస్తున్నారు. దీనికంటే ముందు 'మాస్ జాతర'తో పలకరించనున్నారు. రవితేజ హీరోగా భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ప్రేక్షకులకూ... రవితేజకూ మధ్య బంధం ఎంతో అందమైంది



నవ్వించడం అనేది ఎంత గొప్ప కళారూపమో... దాని వెనక అంతే కష్టం ఉంటుంది. కానీ రవితేజ కొన్ని దశాబ్దాలుగా తెలుగు ప్రేక్షకుల్ని నవ్విస్తూనే ఉన్నారు. ఆయనకి నేను అభిమానిని" అన్నారు ప్రముఖ నటుడు సూర్య. ఆయన ముఖ్య అతిథిగా మంగళవారం రాత్రి 'మాస్ జాతర' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. రవితేజ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. శ్రీలీల కథానాయిక. భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకను ఉద్దేశించి కథానాయకుడు సూర్య మాట్లాడుతూ "రవితేజ పేరు వినగానే నాకు నవ్వు గుర్తొస్తుంది. ఉరిమే ఉత్సాహానికి మారు పేరు ఆయన. ప్రేక్షకులకీ, ఆయనకీ మధ్యనున్న బంధం చాలా అందమైనది. సగటు మనిషిని తెరపై కింగ్‌సైజ్ స్థాయిలో ఆవిష్కరించిన నటుడు. ఆయన నటనలో స్థానికత, సంస్కృతి ఉట్టిపడతాయి. ఆయన చేసిన 'ఇడియట్', 'కిక్', 'విక్రమార్కుడు' చిత్రాలు తమిళంలోనూ ఘన విజయాల్ని అందుకున్నాయి. 'విక్రమార్కుడు'కి రీమేక్‌గా తమిళంలో రూపొందిన 'సిరుత్తై' చిత్రంతో కార్తి కెరీరే మారిపోయింది. కామెడీ టైమింగ్ అనేది కొంతమందిలోనే ఉండే ప్రతిభ. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ తదితర నటుల్లో చూస్తుంటాం. అమితాబ్ అభిమాని అయిన రవితేజ కొన్ని దశాబ్దాలుగా ప్రేక్షకులకు వినోదం పంచుతున్నారు. కలలు నిజం అవుతాయని సహాయ దర్శకుడు నుంచి మాస్ మహారాజ్ వరకూ సాగిన రవితేజ సినీ ప్రయాణమే రుజువు చేసింది. ఈ సినిమాతో దర్శకుడు సహా ఎంతోమంది కలలు నిజం అవుతాయి" అన్నారు. రవితేజ మాట్లాడుతూ "సూర్య అంటే నాకెంతో ఇష్టం. కార్తి, నేను ఎక్కువగా కలుస్తుంటాం. సూర్యని చాలా ఏళ్ల తర్వాత కలిశా. ఇకపై కలుస్తూనే ఉంటాం. ఆయన ఏమిటనేది నేను చెప్పనవసరం లేదు. ఈ వేడుకకి వచ్చినందుకు ఆనందంగా ఉంది. భాను భోగవరపు మాస్ దర్శకుడే కాదు, ఆయన దగ్గర ఇంకా చాలా విభిన్నమైన కథలు ఉన్నాయి. అవన్నీ ప్రేక్షకులు చూస్తారు. ఈ సినిమాతో తనకి కూడా జాతరే. మరో రచయిత నందు కూడా దర్శకుడు కాబోతున్నాడు. భీమ్స్ స్వరపరిచిన పాటల్ని థియేటర్లో ఇంకా ఆస్వాదిస్తారు. శివుడు పాత్రతో నవీన్‌చంద్ర ఇలా కూడా చేస్తాడా అనిపిస్తాడు. ఈ సినిమాతో మరోస్థాయికి చేరాలని కోరుకుంటున్నా. అన్నయ్య రాజేంద్రప్రసాద్, నేను కలిసి చేసిన సన్నివేశాలు చాలా బాగుంటాయి. నాదీ, శ్రీలీలదీ సూపర్‌హిట్ కలయిక అని కచ్చితంగా చెబుతారు ఈ సినిమాతో" అన్నారు. శ్రీలీల మాట్లాడుతూ "రవితేజతో కలిసి చేసిన 'ధమాకా'తో నన్ను ఒక మెట్టు ఎక్కించారు ప్రేక్షకులు. ఈ సినిమాతో మరో మెట్టు ఎక్కిస్తారని ఆశిస్తున్నా" అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "రవితేజ సినిమాల్లో ప్రేక్షకులు ఏం ఆశిస్తారో అవన్నీ ఇందులో ఉంటాయి" అన్నారు. భీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ "ధమాకా' తర్వాత నుంచి...చిరంజీవితో 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా చేసేవరకూ నా ప్రతి పాట వెనకా ఒకరున్నారు. ఆయనే రవితేజ. గడ్డు పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఒక మనిషి దేవుడిలా ప్రత్యక్షమై నిలిచారు. ఆయనే రవితేజ. అందుకే ఆయనంటే నాకు ఇష్టం. మళ్లీ చెబుతున్నా, మరో బ్లాక్‌బస్టర్ సినిమాకి సంగీతం అందించా" అన్నారు. భాను భోగవరపు మాట్లాడుతూ "రవితేజది కూడా ఓ విశ్వవిద్యాలయమే. అందులో డిగ్రీ పట్టా పుచ్చుకుని బయటకు వస్తున్న ఓ విద్యార్థిని నేను. డిస్టింక్షన్‌లో పాస్ అయ్యానని భావిస్తున్నా



# ఇండస్ట్రీకి మహేశ్ బాబు మేనకోడలు.. ఫొటోలు వైరల్

ఇండస్ట్రీకి మరో కొత్తందం పరిచయం కానుంది. టాలీవుడ్‌లో చరిత్ర సృష్టించిన సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి ఒక హీరోయిన్ ప్రేక్షకులను అలరించనున్నారు. ఆమే.. మహేశ్ బాబు మేనకోడలు, మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్. ఎన్నో రోజులుగా ఆమె ఇండస్ట్రీకి రానున్నట్లు వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. నేడు జాన్వీ పుట్టినరోజు సందర్భంగా ఆమె రాకను అధికారికం చేస్తూ మంజుల ఫొటోలను విడుదల చేశారు. ప్రస్తుతం ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

కుమార్తె తెరంగేట్రంపై మంజుల ఆనందం వ్యక్తంచేస్తూ ఆమెను ఆదరించాలని కోరారు. జాన్వీ గతంలో 'మనసుకు నచ్చింది'లో బాలనటిగా అతిథి పాత్రలో కనిపించారు. ఆ సినిమాకు మంజుల దర్శకత్వం వహించగా మహేశ్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. 2018లో ఇది విడుదలైంది. ఇక తాజాగా ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. జాన్వీ ఘట్టమనేని నటించనున్న ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

# భవిష్యత్తులో ప్రపంచ యానిమేషన్ హబ్‌గా భారత్

'కొవిడ్ తరువాత యానిమేషన్ రంగంలో కొంత స్తబ్దత కనిపించినప్పటికీ.. కొన్నాళ్లుగా పుంజుకుంది. భారత్ మరో ఏడేళ్లలో యానిమేషన్ హబ్‌గా ఎదుగుతుంద'ని ఆకాంక్షించారు దర్శకుడు అశ్విన్‌కుమార్. ఇటీవల విడుదలైన యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహా'తో భారీ విజయాన్ని అందుకున్నారాయన.



యానిమేషన్ రంగంపై యువతరం మక్కువ చూపుతున్నారా?

మనదేశంలోని యువతరంలో ప్రపంచాన్ని జయించే శక్తిసామర్థ్యాలున్నాయి. ప్రపంచీకరణ తరువాత అవకాశాలు ముంగిట్లో వచ్చివాలుతున్నాయి. మనకు ప్రతిభావంతులైన మెంటార్స్ కూడా ఉన్నారు. మహావతార్ నరసింహ సినిమాకి యువ ప్రతిభావంతులే ఎక్కువగా పని చేశారు.

ఏఐ ప్రభావం యానిమేషన్ రంగంపై ఎలా ఉంటుంది?

ప్రస్తుతం ఉన్న 'ఏఐ' కాలాన్ని కళాకారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై పూర్తిగా ఆధారపడకుండా సొంత ఆలోచనలతోనే ప్రయత్నాలు మొదలుపెట్టాలి. వివిధ ఏఐ సాధనాల ద్వారా నూతన విషయాలను తెలుసుకునే, నేర్చుకునేందుకు అవకాశంతోపాటు ప్రతిభకు సైతం మెరుగులు దిద్దుకోవచ్చు. అందరూ అనుకుంటున్నట్లు యానిమేషన్ రంగంపై ఏఐ ప్రభావం అంతంత మాత్రమే. కొవిడ్ తరువాత సంబంధిత రంగం ఒడుదొడుకులు ఎదుర్కొన్నా.. ఇప్పుడిప్పుడే అభివృద్ధిపథంలో దూసుకెళ్తోంది. అనైతికంగా కాకుండా నైతికంగా ఏఐని వాడుకోండి. యానిమేషన్ ద్వారా ఏదైనా సృష్టించాలి అనుకున్నప్పుడు ఎక్కువ సమయం పడుతుంది. ఏఐ అన్నిరకాల పనులు చేయలేదు.

భవిష్యత్తులో యానిమేషన్ పరిశ్రమ ఎలా ఉండబోతుంది?

కొన్నాళ్లుగా మార్కెట్ స్తబ్దుగా ఉన్నా.. ఇప్పుడిప్పుడే ప్రభంజనాలు సృష్టించడానికి సిద్ధంగా ఉంది. రానున్న ఏడేళ్లలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద యానిమేషన్ పరిశ్రమగా ఎదగనుంది. జపాన్, హాలీవుడ్ పరిశ్రమలు మనల్ని అనుసరిస్తాయి. ఎందుకంటే పాశ్చాత్య దేశాల్లో చెప్పడానికి పెద్దగా కథలుండవు. కానీ భారతదేశం కథల భాండాగారం. ఆధ్యాత్మిక, పౌరాణిక, సామాజికపరమైన అనేక కథలున్నాయి. కథల్లో దివ్యత్వాన్ని జోడించాలి. పిల్లల మొదలు పెద్దల వరకు అన్ని వయసుల వారిని ఆకట్టుకునే వినోద సాధనం ఏదైనా ఉందంటే అది యానిమేషనే.

మీ తదుపరి ప్రణాళికలేంటి?

'మహావతార్ నరసింహా' చిత్రాన్ని నిర్మించడానికి నాలుగున్నర ఏళ్లు పట్టింది. కారణం అప్పుడున్న సవాళు .. ప్రస్తుతం మన దగ్గరున్న నిపుణులు.. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు. మరో ఆరు కథలు సిద్ధం చేశాం. ఒకొక్కటి రూపొందించడానికి రెండున్నరేళ్లు పడుతుంది. దీంతోపాటు మహావతార్ బ్యానర్‌పై గేమింగ్, కామిక్ లాంటివి కూడా తీసుకురాబోతున్నాం.




# వీరివే తొలి రెండు స్థానాలు

: భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. ఇప్పటికే వన్డే సిరీస్ ముగియగా.. టీ20 సిరీస్ ఇవాళ్టి నుంచి మొదలు కానుంది. తాజాగా ఆసీస్ మాజీ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ ఓ జాబితాను విడుదల చేశాడు. టీమ్‌ఇండియా జట్టు తరఫున అదరగొట్టిన టాప్ -5 వన్డే బ్యాటర్ల లిస్ట్‌ను పేర్కొన్నాడు. అందులో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌కు స్థానం కల్పించినప్పటికీ.. అతడి కంటే ముందు ప్లేస్‌లను ప్రస్తుత తరం ఆటగాళ్లకే ఇచ్చాడు. విరాట్ కోహ్లీ, రోహిత్, సచిన్, ఎంఎస్ ధోనీ, యువరాజ్ సింగ్‌ను టాప్ -5 భారత వన్డే బ్యాటర్లుగా మెక్‌గ్రాత్ అభివర్ణించాడు.

"ఈ లిస్ట్‌లో నేను రోహిత్ శర్మకు రెండో స్థానం ఇస్తా. వన్డే క్రికెట్‌లో అతడి గణాంకాలు చాలా బాగున్నాయి. ఇందులో మూడు డబుల్ సెంచరీలు చేశాడు. వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు 264 పరుగుల రికార్డు కూడా అతడి పేరిటే ఉంది. ఇప్పటివరకు 276 మ్యాచుల్లో 11వేలకు పైగా పరుగులు చేశాడు. టెస్టులతో పోలిస్తే వన్డేల్లోనే అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించాడు.


రోహిత్ క్లాస్ ప్లేయర్. అందుకే అతడికి రెండో స్థానం ఇచ్చా. ఇక ఈ జాబితాలో తొలి ప్లేస్ విరాట్ కోహ్లీని కాదని మరొకరికి ఇవ్వడం చాలా కష్టం. అతడి స్ట్రైక్‌రేట్, సగటు అద్భుతం" అని మెక్‌గ్రాత్ విశ్లేషించాడు.

ఆసీస్‌పై రోహిత్‌కు అద్భుత రికార్డు

దాదాపు ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన రోహిత్ శర్మ ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో అదరగొట్టాడు. ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఆసీస్ గడ్డపై వన్డేల్లో 1000 పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. వన్డేల్లో ఆసీస్‌పై 2500 పరుగులు చేసిన రెండో బ్యాటర్ కూడా రోహితే.

## దిగజారిన గిల్ ర్యాంకు..
# వన్డేల్లో నంబర్ 1 బ్యాటర్‌గా రోహిత్ శర్మ

ఆస్ట్రేలియాతో ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడిన రోహిత్ శర్మ అదరగొట్టాడు. మూడు వన్డేల సిరీస్‌లో ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ చేసిన అతడు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సొంతం



చేసుకున్నాడు. ఆ సిరీస్‌లో రోహిత్ ప్రదర్శనకు ఐసీసీ ర్యాంకుల్లో ఫలితం కనిపించింది. వన్డేల్లో టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు అక్కడ ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు స్థానాలు కిందికి దిగజారి మూడో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 781 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అఫ్గానిస్థాన్ ప్లేయర్ ఇబ్రహీం జద్రాన్ (764) రెండో స్థానంలో ఉండగా.. శుభ్‌మన్ గిల్ (745), బాబర్ అజామ్ (739), విరాట్ కోహ్లీ (725) ఆ తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్‌తో మూడో వన్డేలో హాఫ్ సెంచరీ చేసినప్పటికీ విరాట్ ఒక స్థానం పడిపోయాడు. అంతకుముందు రెండు మ్యాచుల్లోనూ డకౌట్ కావడమే దీనికి కారణమని క్రికెట్ విశ్లేషకుల అంచనా. శ్రేయస్ అయ్యర్ (700) టాప్ -10లో కొనసాగుతున్నాడు. ఇక ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (589) ఏకంగా 23 స్థానాలను మెరుగుపర్చుకొని 25వ ర్యాంక్‌ను అందుకొన్నాడు.

బౌలింగ్ విభాగంలో...

బౌలింగ్ విభాగంలో టీమ్‌ఇండియా తరఫున కేవలం ఒక్కరు మాత్రమే ఉండటం గమనార్హం. అదీనూ కుల్‌దీప్ యాదవ్ (634) ఒక ప్లేస్‌ను కోల్పోయి ఏడో ర్యాంకులో నిలిచాడు. ఆసీస్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ (628) రెండు స్థానాలు పైకి ఎగబాకి 8వ ర్యాంకులో ఉన్నాడు. అఫ్గాన్ ఆటగాడు రషీద్ ఖాన్ (710) బౌలింగ్ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా (215) మాత్రమే ఉన్నాడు. అతడు ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో ఆడని సంగతి తెలిసిందే. అక్షర్ పటేల్ (208) రెండు స్థానాలను మెరుగుపర్చుకొని 12వ ర్యాంకులో నిలిచాడు. ఇందులోనూ అఫ్గాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్‌దే (334) టాప్ ర్యాంకర్.

# పాత సూర్యను చూస్తాం..
## బ్యాట్‌తోనే సమాధానం: అభిషేక్ నాయర్



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్ కోసం భారత్ సిద్ధమైంది. ఇప్పుడు అందరి కళ్లు సూర్యకుమార్ యాదవ్ పైనే. గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి నుంచి పెద్ద ఇన్నింగ్స్ వచ్చిన దాఖలాలు తక్కువే. ఆసియా కప్‌లో ఓ రెండు మ్యాచుల్లో ఫర్వాలేదనిపించినా.. అతడి ఆటతీరు మాత్రం అది కాదు. ఈ క్రమంలో ఆసీస్‌పై తప్పకుండా ఒకనాటి దూకుడుగా ఆడిన సూర్యను చూస్తామని మాజీ కోచ్ అభిషేక్ నాయర్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్‌లో 700కి పైగా పరుగులు చేసినట్లు గుర్తు చేశాడు.

"ఇప్పుడు ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ మరింత ఆసక్తికరంగా మారబోతోంది. కొన్నిసార్లు జట్టు విజయాలు వ్యక్తిగత ప్రదర్శనలను కప్పేస్తాయి. ఫలితాల్లో వ్యత్యాసం వచ్చినప్పుడే ప్రశ్నలు వస్తాయి. టీ20ల్లో చాన్నాళ్ల పాటు వరల్డ్ నంబర్‌వన్ బ్యాటర్‌గా ఉన్న భారత కెప్టెన్ సూర్యకుమార్ నుంచి మెరుగైన ప్రదర్శన రాలేదు. తప్పకుండా అతడి ఆటతీరుపై జట్టులో స్క్రూటినీ జరిగి ఉంటుందని అనుకుంటున్నా. అతడి సత్తా ఏంటో మనకు తెలుసు. ఆసీస్ పిచ్ కండీషన్, బౌన్స్ తప్పకుండా సూర్యకుమార్ బ్యాటింగ్ స్టైల్‌కు నప్పుతాయి. మొన్నటివరకూ అతడి పేలవ ప్రదర్శన తాలూకా ప్రభావం ఇకపై ఏమాత్రం ఉండదని అనుకుంటున్నా. గత ఐపీఎల్‌లో అతడు మంచి ఆటతీరు ప్రదర్శించాడనేది మరిచిపోకూడదు" అని అభిషేక్ నాయర్ వ్యాఖ్యానించాడు.

ఒక్క హాఫ్ సెంచరీ లేదు..

భారత సారథి సూర్యకుమార్ యాదవ్ ఈ ఏడాది ఇప్పటివరకు 12 అంతర్జాతీయ టీ20 మ్యాచులు ఆడాడు. ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. గత ఆసియా కప్‌లో పాక్‌పై చేసిన 47 పరుగులే అత్యధికం. ఫియర్‌లెస్ క్రికెట్ ఆడాలని చెప్పే సూర్య నుంచి సరైన ఇన్నింగ్స్ లేకపోవడం అభిమానులను బాధిస్తోంది. మరోవైపు శుభ్‌మన్ గిల్ రూపంలో సూర్య కెప్టెన్సీకే ముప్పు ఉంది. ఈ క్రమంలో ఆసీస్‌తో జరగబోయే సిరీస్‌లో రాణిస్తే వచ్చే ఏడాది ప్రపంచ కప్ వరకూ సూర్య సారథ్యానికి ఢోకా ఉండదని క్రికెట్ విశ్లేషకుల అంచనా.

# 'కంగారూ'ను జయిస్తేనే ఫైనల్‌కు..



మహిళల ప్రపంచ కప్ 2025) ఆఖరి దశకు చేరుకుంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా ఆశించిన మేరకు ప్రదర్శన చేయకపోయినా కాస్త అదృష్టం తోడవడంతో నాలుగో స్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. వర్షం అంతరాయంతో టోర్నీలో ఇతర జట్లకు సంబంధించిన చాలా మ్యాచ్‌లు రద్దు కాగా.. భారత్ ఏడు పాయింట్లతో నాకౌట్ దశకు క్వాలిఫై అయింది. కానీ, ఇక్కడితో సంబరపడొద్దు. అసలు సిసలు పరీక్ష ముందుంది. ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ చేరినా కప్పు కలను సాకారం చేసుకోలేకపోయిన టీమ్‌ఇండియా.. మూడోసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లాలంటే ముందుగా 'కంగారూ'ను జయించాలి. అక్టోబర్ 30న జరిగే రెండో సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను హర్మన్‌ప్రీత్ సేన అమీ తుమీ తేల్చుకోనుంది.


డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియా ను ఓడించడం భారత్‌కు అంత తేలిక కాదు. ఇప్పటికే లీగ్ దశలో కంగారూలతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 330 పరుగులు చేసినా లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఎల్లిస్ పెర్రీ, ఆష్లీన్ గార్డ్‌నర్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీలతో ఆ జట్టు బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా ఉంది. వీరంతా ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సత్తా ఉన్నవాళ్లే. సూపర్ ఫామ్‌లో ఉన్న ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ భారత్‌తో సెమీస్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. ఇది భారత్‌కు ఉపశమనాన్ని ఇచ్చే అంశం. బౌలింగ్‌లో ప్రధానంగా అలానా కింగ్, అన్నాబెల్ సదర్లాండ్‌తో భారత్‌కు ముప్పుంది. సోఫీ మోలినెక్స్, ఆష్లీన్ గార్డ్‌నర్ కూడా బంతితో రాణిస్తే టీమ్‌ఇండియాకు ఇబ్బందులు తప్పవు. సెమీస్‌కు ముందు ఫామ్‌లో ఉన్న ప్రతీక రావల్ గాయంతో టోర్నీకి దూరమవడం భారత్‌కు ప్రతికూలంగా మారింది. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ సింగ్, దీప్తి శర్మ, రిచా ఘోష్‌లతో పేపర్ మీద టీమ్‌ఇండియా బ్యాటింగ్ విభాగం బలంగా కనిపిస్తున్నా వీరు ఏ మేరకు రాణిస్తారనే దానిపైనే భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. క్రాంతి గౌడ్, శ్రీచరణి, దీప్తి, రేణుకా సింగ్ బంతితో మెరిస్తే ఆసీస్‌కు షాకిచ్చి ఫైనల్‌కు దూసుకెళ్లడం ఖాయం!

మహిళల క్రికెట్లో ఇప్పటిదాకా 12 వన్డే ప్రపంచకప్‌లు జరగ్గా.. భారత్ నాలుగుసార్లు సెమీస్‌కు చేరింది. ప్రస్తుతం జరుగుతోన్న 13వ ఎడిషన్‌లో భారత్ మరోసారి నాకౌట్ దశకు అర్హత సాధించగలిగింది. 1997లో ఆస్ట్రేలియా, 2005లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది.

2005లో కివీస్‌ని 40 పరుగుల తేడాతో మట్టికరిపించిన మిథాలి రాజ్ సేన.. తుది పోరులో ఆస్ట్రేలియా జోరు ముందు నిలవలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2017లో కప్పు గెలిచేందుకు భారత అమ్మాయిలకు మంచి అవకాశమే వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు.

సెమీస్‌లో భీకర ఆస్ట్రేలియాను ఓడించిన భారత్.. ఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో 9 పరుగుల తేడాతో ఓడి విశ్వవిజేతగా నిలిచే ఛాన్స్‌ను మిస్ చేసుకుంది. ఇప్పుడు టైటిల్‌కు మరో రెండు అడుగుల దూరంలో నిలిచిన టీమ్‌ఇండియా.. సెమీస్‌లో 'ఆస్ట్రేలియా' గండాన్ని దాటితే.. ఫైనల్‌లో ఇంగ్లాండ్ లేదా సౌతాఫ్రికాతో తలపడుతుంది.

# షమీకి ఎవరి ధ్రువీకరణ అవసరం లేదు: బెంగాల్ కోచ్



తన ఫిట్‌నెస్‌పై వచ్చిన అనుమానాలను భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ పటాపంచలు చేశాడు. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు జట్టు ఎంపిక సమయంలో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారమే రేపాయి. షమీ ఫిట్‌నెస్‌పై తమ వద్ద అప్‌డేట్ లేదని అగార్కర్ వ్యాఖ్యానించాడు. షమీ సోషల్ మీడియాలో దీనిపై కాస్త ఘాటుగానే స్పందించాడు. ఇప్పుడు రంజీ ట్రోఫీలో గుజరాత్‌పై బెంగాల్ విజయం సాధించడంలో షమీ కీలకపాత్ర పోషించాడు. ఈ సందర్భంగా బెంగాల్ కోచ్, మాజీ క్రికెటర్ లక్ష్మీరతన్ శుక్లా కీలక వ్యాఖ్యలు చేశాడు. షమీకి ఎవరినుంచి ధ్రువీకరణ అవసరం లేదని.. అతడు మ్యాచ్ విన్నర్ అని అభివర్ణించాడు.

"షమీకి ఎవరి నుంచి కూడా ప్రత్యేకంగా సర్టిఫికెట్ అవసరం లేదు. అతడికి అతడే ధ్రువీకరించుకోగలడు. అభిమానులు, మీడియా ఎప్పుడూ అతనికి మద్దతుగా ఉంటుంది. ఆ దేవుడే షమీకి అతిపెద్ద సెలక్టర్. దేశవాళీలో అతడి ఆటను అందరూ చూశారు. షమీ ఫిట్‌నెస్ స్థాయి కూడా బాగుంది" అని శుక్లా వ్యాఖ్యానించాడు.

రంజీ ట్రోఫీలో..

గుజరాత్‌తో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో బెంగాల్ అద్భుత విజయం సాధించింది. భారత సీనియర్ పేసర్ షమీ మాత్రం తనదైన శైలిలో ప్రత్యర్థిపై బౌలింగ్‌తో విరుచుకుపడ్డాడు. అతడి నుంచి ఐదు వికెట్ల ప్రదర్శనా వచ్చింది. ఈ మ్యాచ్‌లో ఏకంగా 8 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటి ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచుల్లోనూ కలిపి 15 వికెట్లు తీసిన అతడు.. ఒకసారి ఫైఫర్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

## వన్డే ప్రపంచ కప్ 2027.
# జట్టులో ఎనిమిదో స్థానం నాదే: శార్దూల్

మొన్నటి వరకు సీనియర్ పేసర్ మహ్మద్ షమీ భారత సెలక్షన్ కమిటీ తనను పరిగణనలోకి తీసుకుంటుందనే ఆశతో ఉన్నాడు. ఇప్పుడు ఆ జాబితాలోకి మరో ఆటగాడు చేరాడు. తాను వచ్చే వన్డే ప్రపంచకప్‌లో తప్పకుండా ఆడతానని శార్దూల్ ఠాకూర్ ) వ్యాఖ్యానించాడు. మరీ ముఖ్యంగా ఇప్పుడు యువ ప్లేయర్ హర్షిత్ రాణా పోషిస్తోన్న రోల్ తనదేనని స్పష్టంచేశాడు. ప్రస్తుతం శార్దూల్ రంజీ ట్రోఫీలో ఆడుతున్నాడు.

"నిరంతరం మ్యాచులు ఆడుతూ.. మెరుగైన ప్రదర్శన చేయడమే నా పని. మళ్లీ జాతీయ జట్టులోకి రావడమే లక్ష్యం. అందుకోసం ఏం చేయాలనేది నాకు తెలుసు. మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు చేయాలి. అదే జట్టు ఎంపిక సమయంలో నన్ను పరిగణనలోకి తీసుకొనేందుకు ఉపయోగపడుతుంది. ప్రతిఒక్కరూ జాతీయ జట్టుకు ఆడాలని కోరుకుంటారు. ఇందులో నేనేమీ మినహాయింపు కాదు. తప్పకుండా మళ్లీ పునరాగమనం చేస్తా" అని శార్దూల్ తెలిపాడు.

నా ప్లేస్ అదే.."దక్షిణాఫ్రికా వేదికగా వన్డే ప్రపంచకప్ జరగనుంది. అక్కడ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లకు అవకాశాలు ఎక్కువ. నేను కూడా అదే స్పాట్‌పై దృష్టిపెట్టా. నా అవసరం ఉందని భారత జట్టు భావించినప్పుడు లేదా నేను సెలక్ట్ అయినప్పుడు అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటా. నా సన్నద్ధత ఎలా ఉంటుందంటే.. రేపే మ్యాచ్ ఆడాలన్నా సరే ఐ యామ్ రెడీ" అని



శార్దూల్ తెలిపాడు. ఇటీవలే ముగిసిన ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో హర్షిత్ రాణా ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి భారీ షాట్లే ఆడాడు. రెండో వన్డేలో ఓ మాదిరి స్కోరు చేయడం వెనక హర్షిత్ పాత్ర కూడా ఉంది. 34 ఏళ్ల శార్దూల్ ఠాకూర్ ఇప్పటివరకు కేవలం 47 వన్డేలు, 25 టీ20లు, 13 టెస్టులు మాత్రమే ఆడాడు. చివరిసారిగా 2023 వన్డే ప్రపంచకప్‌లో జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అప్పటినుంచి జాతీయజట్టులో చోటు కోసం శ్రమిస్తూనే ఉన్నాడు. అడపాదడపా టెస్టుల్లోకి వచ్చినా.. అది పెద్దగా ప్రభావం చూపించలేదు.

# అమరులైన పోలీసుల సేవలను గుర్తు చేసుకోవాలి

* నిమిషానికి రెండు డయల్ 100 ఫోన్ కాల్స్ అటెండ్
* రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు







ఎల్బీనగర్, అక్టోబర్ 29 (భారత శక్తి): ప్రజల కోసం విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని, మెరుగైన సమాజం కోసం ప్రజలు కూడా యూనిఫామ్ లేని పోలీసులేనని రాచకొండ సిపి సుధీర్ బాబు అన్నారు.బుధవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో రాచకొండ సిపి సుధీర్ బాబు ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 2 వేల మందితో (విద్యార్థులు, కాలనీ వాసులు, తదితరులు) ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుద్దాల అశోక్ తేజ, సుధీర్ సంద్ర, డా, కవిత ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థుల్లో, ప్రజల్లో చైతన్యం నింపారు. అనంతరం సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ, సమాజంలో ప్రజలకు సేవలందించి అమరులైన పోలీసుల సేవలను గుర్తు చేసుకునేందుకు పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో రాచకొండ పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు.రాచకొండ కమిషనరేట్ లో ప్రతి ఒక్క నిమిషానికి రెండు డయల్ 100 ఫోన్ కాల్స్ అటెంప్ట్ చేస్తున్నామని, పోలీసులు అన్ని రకాల సేవలను ఏకకాలంలో పనిచేసి ప్రజలకు ఆరు విభాగాలుగా ఏర్పడి విజుబుల్ పోలీసింగ్ లో భాగంగా సేవలు అందిస్తూ, ప్రజలకు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కన్నవారికి దూరంగా ఉండే సీనియర్ సిటిజెన్స్ వారి ఇంటింటికి వెళ్లి సహాయ సహకారం అందిస్తున్నామని అన్నారు.ఆపరేషన్ స్మైలీతో ప్రజలకు దగ్గర కావడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యమని, దేశంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా బాల కార్మికులను గుర్తించి వారికి బంగారు భవిష్యత్తు అందించామని గుర్తు చేశారు.ప్రజల కోసం విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మెరుగైన సమాజం కోసం ప్రజలు కూడా యూనిఫామ్ లేని పోలీసులేనన్నారు.ప్రజలకు సేవలందించే క్రమంలో పోలీసులు ప్రాణాలు కోల్పోతున్న సంగతి అందరికీ తెలిసిందేనని అన్నారు.దేశంలో ఎన్.బి.డబ్ల్యూ ఫ్రీ కమిషనరేట్ గా రాచకొండ కమిషనరేట్ నిలిచిందని రాచకొండ సిపి సుధీర్ బాబు గుర్తు చేశారు. ప్రజలకు సేవలందించే పోలీసుల సేవలను ప్రజలు గుర్తించాలని, ప్రజలకు అందించే సేవలను తెలియజేసేందుకు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ తో పాటు చట్ట వ్యతిరేకమైన చర్యలు చేసే వాళ్ళను శిక్షించడంలో రాచకొండ పోలీసులు ఎప్పుడైనా ముందుంటారని గుర్తు చేశారు. అనంతరం సుద్దాల అశోక్ తేజ్ మాట్లాడుతూ, పోలీసులతో గానీ, ప్రతి ఒక్కరితో మనం కృతజ్ఞత కలిగి ఉండాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉన్నట్లు మనం కూడా ఫ్రెండ్లీ సిటిజెన్ లాగా ఉండాలని, మనం ఎంత ప్రశాంతంగా ఉంటున్నామో దానికి కారణం పోలీసులేనని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అనంతరం కొన్ని పాటల రూపంలో ప్రజలు ఎలా ఉండాలో తెలిపారు. సుధీర్ సంద్ర మాట్లాడుతూ, సోషల్ మీడియాకు విద్యార్థులు ఎంత దూరం ఉండాలో, సమాజంలో ఎలా మెదలాలో సూచించారు. పోలీసులు పడుతున్న కష్టాలను కళ్ళకు కట్టినట్లు చూపించి పోలీసుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, డ్రగ్స్, గంజాయి, ర్యాగింగ్ తదితర వాటిపట్ల అవగాహన కల్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్స్ ను చూసి వాటి గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపిలు పద్మజా, అనురాధ,ఆకాంక్ష్ యాదవ్,అరవింద్ బాబు,ఇందిరా,ఉషా రాణి,సునీత రెడ్డి,జి నరసింహ రెడ్డి,రమణ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసులు,నాగలక్ష్మి, మనోహర్, శ్యామ్ సుందర్, అడిషనల్ డీసీపీలు, ఏసిపిలు, సీఐలు రాచకొండ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ ప్రజా భవన్ లో జరిగిన రాకేష్, రిత్వికల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నైనా జైస్వాల్, బడంగ్ పేట్ మున్సిపల్ కమిషనర్ పి సరస్వతీ,పెద్దబావి సుదర్శన్ రెడ్డి,లిక్కి మమత కృష్ణ రెడ్డి, సుక్క శివకుమార్,మర్రి జగన్మోహన్ రెడ్డి,రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ తదితరులు హాజరైనారు..

బడంగ్ పేట్, అక్టోబర్ 29 (భారత శక్తి ):



## వర్షాల వేళ.. క్షేత్ర స్థాయిలో పర్యటించిన కమిషనర్లు

* రహదారులపై నీరు నిలవకుండా చూడాలంటూ ఆదేశం
* లకడికాపూల్ పైపు లైను పనులు పూర్తి చేయాలని సూచన



హైదరాబాద్, అక్టోబరు 29 (భారత శక్తి): `మోంథా` తీవ్ర తుపానుతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లకడికాపూల్ పరిసర ప్రాంతాలను హైడ్రా, జీహెచ్ఎంసీ కమిషనర్లు ఏవీ రంగనాథ్,ఆర్వీ కర్ణన్ పరిశీలించారు.మాసబ్ ట్యాంకు నుంచి లకడికాపూల్ వైపు వస్తున్నప్పుడు మెహదీ ఫంక్షన్ హాల్ వద్ద వర్షపు నీరు రోడ్డు మీద నిలవడానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇక్కడ వర్షపు నీరు నిలవడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని.. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఇరువురు కమిషనర్లు అధికారులను ఆదేశించారు.ఇప్పటికే ఇక్కడ ఇరువైపులా రోడ్డును తవ్వి రెండు ఫీట్ల విస్తీర్ణంతో ఉన్న పైపులైన్లను వేశామని..వాటికి మహవీర్ ఆసుపత్రి పరిసరాలతో పాటు చింతలబస్తీ ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు, వరద నీటిని అనుసంధానం చేయాల్సినవసరం ఉందన్నారు.త్వరితగతిన ఈ పనులు కూడా పూర్తి చేయాలని సూచించారు.ఈ లోగా మహావీర్ ఆసుపత్రి ముందు నుంచి మెహిదీ ఫంక్షన్ హాల్ వరకు రోడ్డుకు పక్కగా ఉన్న పైపులైన్లలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తే.. సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందని కమిషనర్లు సూచించారు. ఒకటి రెండు రోజుల్లో ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులు కూడా సహకరించి పైపులైన్ల అనుసంధాన పనులు త్వరగా జరిగేలా సహకరించాలని సూచించారు.లకడికాపూల్ పరిసరాలను సందర్శించిన వారిలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ కూడా కమిషనర్లతో పాటు ఉన్నారు.

## మధుయాష్కికి జ్ఞాపికను అందజేసిన బొడ్రాయి ఉత్సవ సమితి ప్రతినిధులు

ఎల్బీనగర్, అక్టోబర్ 29 (భారత శక్తి): హయత్ నగర్ గ్రామ బొడ్రాయి ఉత్సవ సమితి ప్రతినిధులు బుధవారం ఉదయం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ని కలిశారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు సహకారం అందించిన మధుయాష్కిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ ప్రతినిధులందరినీ మధుయాష్కి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి కన్వీనర్ కల్లెం రవీందర్ రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, ప్రతినిధులు నక్క దర్శన్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, తాటి చెట్టు సునీల్ గౌడ్, సిహెచ్ రమేష్, గజ్జి భాస్కర్ యాదవ్, వెంకటేష్ గౌడ్, శంకర్ రెడ్డి, బెన్నూరు సేలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్మెంట్ విడుదలకై టిఎస్టిసిఈఏ సమావేశం

* కళాశాలల బంద్ పై శనివారం కార్యాచరణ ప్రకటిస్తాం..
* వెల్లడించిన అయినేని సంతోష్ కుమార్..

హైదరాబాద్ :భారతశక్తి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు 2 6 నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన కారణం ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాలేదు.. కావున జీతాలు ఇవ్వడం లేదని యాజమాన్యాలు చెప్పడం జరుగుతుంది. ఫీజు రీయింబర్స్మెంట్ ప్రతి సంవత్సరం విడుదల చేయాలని ఉన్న అది విడుదల చేయడం లేదు. ప్రస్తుతం 8500 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బాకీ ఉన్నది. ఈ విషయంలో టిఎస్టిసిఈఏ అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్మెంట్ను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో మా కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని టిఎస్టిసిఈఏ సంఘం శనివారం సాయంత్రం 7 గంటలకి ఆన్లైన్ గూగుల్ మీటింగ్ పెట్టడం జరుగుతుంది. కావున ప్రతి ఒక్కరూ మీటింగుకి హాజరు కావాలని వారు కోరారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం తాము పోరాటం చేస్తామన్నారు.



## కవితక్క జనం బాట ఘన విజయం సాధించింది

* రంగారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షుడు,
* రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి): బుధవారం విలేఖరులు అందజేసిన ఒక ప్రకటనలో పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో రాష్ట్రంలోని ప్రాజెక్టు పనులపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తెలంగాణ జాగృతి జనం బాటలో కవితక్క, ముంపు గ్రామాల్లో ప్రజల పరిస్థితిని తెలుసుకుంటూ, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని, ముంపు గ్రామాల్లో పునరావాస పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. గత రెండు సంవత్సరాలుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ప్రెస్ మీట్ లు, సోషల్ మీడియా విమర్శలతోనే సరిపెట్టుకున్నాయి తప్ప, ప్రజల మధ్యకు వెళ్లి వారి బాధలను తెలుసుకున్న సందర్భాలు చాలా తక్కువ. కానీ, కవితక్క నీళ్లు, నియామకాలు, నిధులు, అమరవీరులు, సామాజిక తెలంగాణ అంశాలపై ప్రజల్లోకి వెళ్లి మాట్లాడడంతో ప్రతిపక్ష పార్టీలు కలవరపడుతున్నాయి అని పాండురంగా రెడ్డి అన్నారు..

# రఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము... అంబాలా ఎయిర్‌బేస్‌లో గగన విహారం

* **హర్యానాలోని అంబాలా ఎయిర్‌బేస్‌లో ప్రత్యేక సార్టీ**
* **పైలట్ యూనిఫాంలో గగన విహారం చేసిన భారత ప్రథమ పౌరురాలు**
* **వాయుసేన సామర్థ్యాలపై విశ్వాసాన్ని చాటిన రాష్ట్రపతి**
* **'ఆపరేషన్ సిందూర్'లో రఫేల్ జెట్ల కీలక పాత్ర**
* **గతంలో సుఖోయ్-30 విమానంలోనూ ప్రయాణించిన ముర్ము**

ఢిల్లీ, అక్టోబర్ 29 (భారత శక్తి) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. హర్యానాలోని అంబాలా వాయుసేన స్థావరం నుంచి ఆమె ఈ ప్రత్యేక సార్టీలో పాల్గొన్నారు. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించిన రఫేల్ జెట్‌లో రాష్ట్రపతి ప్రయాణించడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత వాయుసేనకు చెందిన యుద్ధ విమానంలో ఆమె ప్రయాణించడం ఇది రెండోసారి. ఈ సార్టీకి ముందు రాష్ట్రపతి ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్ యూనిఫాం, హెల్మెట్ ధరించి విమానం ఎక్కేందుకు సిద్ధమయ్యారు. విమానం టేకాఫ్ అయ్యే ముందు ఆమె అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏ.పి. సింగ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. త్రివిధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలిగా ఉన్న ద్రౌపది ముర్ము, గతంలో 2023 ఏప్రిల్ 8న అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో సుఖోయ్30 ఎంకెఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు. ఈ ఘనత సాధించిన మూడో రాష్ట్రపతిగా, రెండో మహిళా రాష్ట్రపతిగా ఆమె నిలిచారు. ఇంతకుముందు మాజీ రాష్ట్రపతులు ఏపీజే అబ్దుల్ కలాం (2006), ప్రతిభా పాటిల్ (2009) కూడా సుఖోయ్30 విమానాల్లో ప్రయాణించారు. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ సంస్థ తయారు చేసిన రఫేల్ యుద్ధ విమానాలను 2020 సెప్టెంబర్‌లో అంబాలా వైమానిక స్థావరంలో అధికారికంగా వాయుసేనలోకి ప్రవేశపెట్టారు. 2020 జులైలో ఫ్రాన్స్ నుంచి వచ్చిన తొలి ఐదు విమానాలను 17వ స్క్వాడ్రన్ 'గోల్డెన్ యారోస్'లో చేర్చారు. సుమారు 22 ఏళ్ల తర్వాత భారత వాయుసేనలోకి దిగుమతి చేసుకున్న తొలి యుద్ధ విమానం రఫేల్ కావడం విశేషం.

## నల్లగొండ జిల్లాలో ఉగ్రరూపం దాల్చిన మూసీ..
# రాకపోకల బంద్

హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి) : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు నల్లగొండ జిల్లాలో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దీంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు ఏడు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 3, 4, 5, 6, 8, 10, 12 నంబర్ల క్రస్ట్ గేట్లను 4 అడుగుల మేర ఎత్తి, 20 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు. నీటి విడుదలతో మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. నదిలోకి ఎవరూ వెళ్లవద్దని, పశువులను కూడా నది వైపు తీసుకెళ్లవద్దని సూచించారు. మరోవైపు మూసీ ఉద్ధృతి కారణంగా పలుచోట్ల రవాణాకు అంతరాయం ఏర్పడింది. జూలూరురుద్రవెల్లి వద్ద ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోచంపల్లిబీబీనగర్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీబీనగర్, భువనగిరి వెళ్లాల్సిన వాహనదారులు పెద్ద రావులపల్లి మీదుగా చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్నారు. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, మూసీ నది సమీప ప్రాంతాల్లో సంచరించవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

# మొంథా తుఫాను ప్రభావం... అధికారులకు సీఎం ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి) : మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాయుగుండం ప్రభావంపై ముఖ్యమంత్రి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని, వారికి దిశానిర్దేశం చేశారు. వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో మొంథా తుపాను ప్రభావం అధికంగా ఉండగా, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారిమళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లకు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించే అవకాశం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం చోటుచేసుకోకుండా శాఖలు జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.




# అజారుద్దీన్‌కు మంత్రి పదవి... ఎల్లుండి ప్రమాణ స్వీకారం?

హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి): కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి లభించినట్టు తెలుస్తోంది. ఎల్లుండి తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరగనుందని, ఆయన మంత్రిగా ప్రమాణం చేస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణకు పార్టీ అధిష్ఠానం నుంచి అనుమతి లభించినట్లు సమాచారం. తెలంగాణ మంత్రివర్గంలో 18 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం 15 మంది మంత్రులు ఉన్నారు. మరో ముగ్గురికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మైనార్టీ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మంత్రిగా అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. అజారుద్దీన్ గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఉప ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు ఆసక్తి చూపినప్పటికీ, ఆయనకు ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాంల పేర్లను ఎంపిక చేసి, గవర్నర్ ఆమోదం కోసం పంపింది. గవర్నర్ ఇంకా ఆమోదం తెలపాల్సి ఉంది. అయినప్పటికీ అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఏఐసీసీ ఆమోదం తెలిపినట్లు సమాచారం.

## అభ్యర్థులు ఈసీ రూల్స్‌ను ఫాలో అవుతూ
# ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి

* **ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలి.**
* **ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి**

హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి): జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక లో పోటీ చేసే అభ్యర్థులు కేంద్ర ఎన్నికల సంఘం మార్గ దర్శకాలను, నిబంధనలను తప్పక పాటిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి స్పష్టం చేశారు.బుధవారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోలీస్ పరిశీలకులు సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను వివరించారు. ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారానికి చేసే ప్రతి పైసాను ఎన్నికల సంఘంకు తెలుపాలన్నారు. ఖర్చులకు సంబంధించి అభ్యర్థులు పక్కగా డాక్యుమెంటేషన్ చేసుకోవాలన్నారు. ఖర్చుల వివరాలు నిర్దిష్ట గడువులో ఎన్నికల సంఘానికి సమర్పించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను తప్పక పాటించాలనీ చెప్పారు. ఎన్నికల స్వేచ్ఛాయిత, ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా రాజకీయ పార్టీలు, ప్రతినిధులు పోటీ చేస్తున్న అభ్యర్థులు సహకారం అందించాలన్నారు.ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారి పి సాయిరాం లు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం..
# ఈ ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి):మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. కుండపోత వర్షాల కారణంగా పలు ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లు తెగిపోవడం, వంతెనలపై నుంచి నీరు పోవడం, రోడ్లపై నీరు నిలవడం వంటి కారణాలతో పలు రహదారులు తాత్కాలికంగా మూతబడ్డాయి. భారీ వర్షాలకు వరంగల్ ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ రహదారిని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. వరంగల్ నగరంలో పలు కాలనీలు నీట మునిగాయి. వరంగల్ బస్టాండ్ చెరువును తలపిస్తోంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం మహబూబాబాద్ జిల్లాల మధ్య వాల్యాతండా సమీపంలోని వంతెనకు ఆనుకుని ఆకేరు వాగు ప్రవహిస్తోంది. దీంతో ఈ రోజు సాయంత్రం నుంచి రెండు జిల్లాల మధ్య రాకపోకలను నిలిపివేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం వీరిశెట్టిపల్లి గ్రామ సమీపంలోని కాగ్నా నదిలో ఒక వ్యక్తి కొట్టుకు వచ్చాడు. యాలాల మండలం ఆగనూరు గ్రామానికి చెందిన నర్సింహులు ప్రమాదవశాత్తూ నదీ ప్రవాహంలో చిక్కుకున్నాడు. అతడు నదిలో కొట్టుకురావడాన్ని గమనించిన వీరిశెట్టిపల్లి యువకులు హరీశ్, శ్రవణ్ కుమార్, శంకర్ అతనిని రక్షించారు. శ్రవణ్, హరీశ్ ఈదుకుంటూ వెళ్లి నర్సింహులు కాపాడి ముందుకు తీసుకురాగా, అనంతరం శంకర్ తాడు విసరడంతో దాని సాయంతో అందరూ ఒడ్డుకు చేరుకున్నారు.



# 'మొంథా' ప్రభావం..
## 127 రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి): మొంథా తుపాను, వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. 127 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతో పాటు మరో 14 రైళ్లను దారి మళ్లించింది. ఫలక్‌నుమా, ఈస్ట్‌కోస్ట్, గోదావరి, విశాఖ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేశారు. వర్షాల కారణంగా పలు రైల్వే స్టేషన్లలో ఎక్కడికక్కడే రైళ్లు నిలిచిపోయాయి. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గుండ్రాతిమడుగులో కోణార్క్ ఎక్స్‌ప్రెస్, డోర్నకల్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయాయి. ఏపీలోని కృష్ణా జిల్లా కొండపల్లిలో సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. ఏపీలోని పలు స్టేషన్లలో 12 గూడ్స్ రైళ్లు నిలిచిపోయాయి.

# నిజాంపేటలో పార్కులను కాపాడిన హైడ్రా

* **2600 గజాల పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్**
* **రూ. 39 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా**
* **సంబరాలు చేసుకున్న కాలనీ వాసులు**




హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి): భారత శక్తి.. నిజాంపేట మున్సిపాలిటీలో వేర్వేరు ప్రాంతాల్లో రెండు పార్కులను హైడ్రా బుధవారం కాపాడింది. బృందావన్ కాలనీలో 2300 గజాల పార్కును కాపాడగా.. కౌశల్యా కాలనీలోని 300ల గజాల పరిధిలోని బనియన్ ట్రీ పార్కును కబ్జాల నుంచి రక్షించింది. 2600ల గజాల స్థలం విలువ రూ. 39 కోట్లకు పైగా ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్ర స్థాయిలో విచారించిన అధికారులు పార్కు స్థలాలుగా గుర్తించి బుధవారం ఆక్రమణలను తొలగించింది. దీంతో బృందావన్ కాలనీ నివాసితులు పిల్లా పాపలతో పార్కుకు వచ్చి సంబరాలు చేసుకున్నారు. సర్వే నంబరు 93లో ఉన్న ఈ స్థలాన్ని పార్కు స్థలంగా గతంలోనే నిర్ధారించారు. అయితే సర్వే నంబరు 94 కి సంబంధించిన ల్యాండ్‌గా స్థానికంగా పేర్కొంటూ స్థానికంగా ఉన్నవారు కబ్జా చేశారు. ఇప్పటికే వినియోగంలో ఉన్న పార్కు స్థలంలోని పిల్లల ఆటవస్తువులు ధ్వంసం చేసి.. పార్కు బోర్డును తొలగించి.. ప్రహరీని కూడా కూల్చేసి కబ్జా చేశారు. బృందావన్ కాలనీ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేయగా... హైడ్రా సంబంధిత స్థానిక అధికారులతో పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారి ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించి పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కులను కాపాడినట్టు సూచిస్తూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. దీంతో బృందావన్ కాలనీ నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు. హైడ్రాను తెచ్చిన ప్రభుత్వానికి, ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి పార్కులను కాపాడిన హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.



# స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ భారీ మోసం..

- వందల కుటుంబాల కష్టార్జితాన్ని దోచుకున్న దొంగలు
- మూడేళ్ళ క్రితం కంపెనీకి డబ్బులు చెల్లించిన బాధితులు
- వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన స్పెక్ట్రా
- ప్లాట్లకు సంబంధించిన పత్రాలు ఇవ్వలేదు
- రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్న యాజమాన్యం
- బాధితులు ఎన్ని ఆందోళనలు చేసినా ఫలితం లేదు
- పుస్తెలతాళ్లు సైతం కొడవపెట్టి ప్లేటుల కొనుగోలు
- ప్లాట్లు ఇవ్వకుండా, కట్టిన డబ్బులు ఇవ్వకుండా తిప్పతున్న యాజమాన్యం
- బాధితుల్లో అధికంగా పేదలు, మధ్యతరగతి వాళ్ళే
- హెచ్.ఎం.డీ.ఏ. అప్రూవల్ ప్లాట్స్ అంటూ నమ్మించి మోసం
- పెద్ద ఎత్తున ఏజంట్లను నియమించుకుని అమాయకులకు వల
- భారీ రిటర్న్స్ వస్తాయని నమ్మబలికిన స్పెక్ట్రా
- ప్రభుత్వం కలుగజేసుకోవాలంటున్న బాధితులు




**గవర్నమెంట్ అప్రూవల్ ప్లాట్స్.. అత్యధిక రిటర్న్స్.. మీ పెట్టుబడికి మా హామీ.. జీవితంలో స్థిరపడండి.. మీకంటూ ఒక ఆస్థిని సంపాదించుకోండి .. ఇలాంటి కల్లబొల్లి మాటలు చెప్పారు.. ఏజెంట్లను నియమించుకుని, ఆ ఏజెంట్లకు ఖరీదైన బహుమతులు ఇస్తూ.. ప్రచార ఆర్భాటాలు చేస్తూ.. అమాయకులకు గాలం వేసి నిలువునా ముంచేశారు.. గడచిన మూడేండ్ల నుంచి ఈ దోపిడీ పర్వం కొనసాగుతోంది.. కోట్లు దండుకున్నాక చేతులెత్తేశారు.. తాము మోసపోయామని తెలుసుకున్న బాధితులు లబోదిబో మంటూ రోడ్డుకెక్కారు.. కార్యాలయం ముందు ఆందోళనలు చేపట్టారు.. కానీ ఫలితం ఏమీ లేకపోయింది.. ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాధుడు లేకపోయారు.. తమ జీవితాలు నాశనం అయ్యాయని.. ఇక తమకు మరణమే శరణ్యం అంటున్నారు బాధితులు.. వీరందరినీ నట్టేట ముంచిన సంస్థ స్పెక్ట్రా..**




- **బాధితుల తరఫున పోరాటానికి సిద్ధమైన " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ**

**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి) :**

రియల్ ఎస్టేట్ రంగంలో మరో పెద్ద ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ కంపెనీ పేరుతో ప్రజలను మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తక్కువ ధరలకు ప్లాట్లు ఇస్తామని చెప్పి, వంద కోట్ల రూపాయలకుపైగా సొమ్ము సేకరించి, చివరికి ప్రజల కలలను ఛిన్నాభిన్నం చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

*** ప్లాట్ల మాయాజాలంతో మోసానికి బలైన మధ్యతరగతి కుటుంబాలు :**

బాధితులు చెబుతున్న వివరాల ప్రకారం, "మూడేళ్ల క్రితమే డబ్బులు చెల్లించాం, కానీ ఇప్పటి వరకు ప్లాట్ల పత్రాలు ఇవ్వలేదు. తేదీలు మార్చుతూ మోసం చేశారు. చివరికి ఫోన్ కూడా ఎత్తడం మానేశారు," అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ సంస్థ ఎల్బీనగర్‌లో కార్యాలయం నిర్వహిస్తూ, "ప్రత్యేక ఆఫర్లు, తక్కువ ధరల ప్లాట్లు" అంటూ ప్రజలను ఆకర్షించింది. మొదట ఏజెంట్లకు కమీషన్లు, బహుమతులు, కార్ల వరకు ఇస్తూ విశ్వసనీయతను సంపాదించిన సంస్థ, చివరికి అదే నమ్మకాన్ని ఆయుధంగా మార్చి పెద్ద ఎత్తున మోసం చేసింది.

*** బాధితుల ఆందోళనలు.. న్యాయం కోరుతున్న ప్రజలు :**



ఇటీవలి రోజుల్లో ఎల్బీనగర్ కార్యాలయం ముందు వందలాది బాధితులు ఆందోళనలు చేపట్టారు. చాలా మంది పేద, మధ్యతరగతి ప్రజలే ఈ మోసానికి బలయ్యారు. "సొంతింటి కల సాకారం అవుతుందనుకున్నాం, కానీ అది ఇప్పుడు అప్పుల బారిన పడింది," అని వాపోతున్నారు బాధితులు..

*** మార్యాల జగన్ పేరుతో జరిగిన ప్రచారం.. అసలు వాస్తవం ఏమిటి?**

ఈ కేసుల్లో "మార్యాల జగన్" అనే పేరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. అయితే, ప్రస్తుతం లభ్యమైన అధికారిక సమాచారం ప్రకారం ఆయనపై ప్రత్యక్ష ఆరోపణలు లేదా నమోదు చేసిన కేసులు లేవు. దర్యాప్తు సంస్థలు ఇంకా విచారణ కొనసాగిస్తున్నాయి. పోలీసులు, ఆర్థిక నేర విభాగం కొన్ని కీలక వ్యక్తులను గుర్తించి విచారణ ప్రారంభించినట్టు తెలుస్తోంది. కానీ ఫైనల్‌గా నిందితుల జాబితా ఇంకా ప్రకటించబడలేదు.

*** ప్రభుత్వం కదిలింది.. కేసులు నమోదు :**

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, కూకట్‌పల్లి, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదు అయ్యాయి. బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో, ప్రభుత్వం కూడా దర్యాప్తును వేగవంతం చేసింది. మోసానికి పాల్పడినవారిని గుర్తించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇస్తున్నారు.

*** బాధితుల హెచ్చరిక :**


"ఇకనైనా ఈ రియల్ ఎస్టేట్ మోసాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. మన నమ్మకాన్ని మోసం చేసిన వారికి గట్టి శిక్ష తప్పక విధించాలి," అని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



# "హైడ్రా" తవ్వి తీసిన బమ్మక్నుద్దౌలా చెరువు


- **పాతబస్తీలో చారిత్రక చెరువు పునరుద్ధరణ**
- **నవంబరు నాటికి పూర్తి చేయాలన్న హైడ్రా కమిషనర్**
- **క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత పలు సూచనలు**

హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి): పాతబస్తీలో చారిత్రక బమ్మృక్నుద్దౌలా చెరువు సర్వాంగ సుందరంగా సిద్ధమౌతోంది. నవంబరు నెలాఖరు నాటికి ఈ చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలనే లక్ష్యంతో హైడ్రా పని చేస్తోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం బమ్మృక్నుద్దౌలా చెరువు పునరుద్ధరణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ క్రమంలోనే చెరువు ఆక్రమణలను గత ఏడాది ఆగస్టు నెలలో తొలగించినట్టు చెప్పారు. 18 ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు కేవలం 4.12 ఎకరాలకు పరిమితమైపోగా.. ఆక్రమణలను తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొన్నారు.ఇప్పుడు చెరువును 18 ఎకరాల మేర విస్తరించి.. వరద కట్టడితోపాటు.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని హైడ్రా కమిషనర్ చెప్పారు. చెరువులోకి వరద నీరు చేరేలా.. నిండితే పోయేలా నిర్మించిన ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్లను హైడ్రా కమిషనర్ పరిశీలించారు.



**చెరువు చుట్టూ ఆకర్షణలు..**

చెరువు చుట్టూ బండ్ నిర్మించి వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తున్నారు. అలాగే చెరువు కట్ట చుట్టూ ఫెన్సింగ్ నిర్మిస్తున్నారు. అలాగే చెరువు లోపలి వైపు కూడా ఎవరూ లోనికి వెళ్లకుండా గట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ఆట ఏరియాలు ఏర్పాటు చేస్తున్నారు.. అలాగే వృద్ధులు సేద దీరే విధంగా అక్కడ సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పార్కులు నిర్మిస్తున్నారు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. చెరువు చుట్టూ రహదారులు నిర్మించడంతో పాటు.. గ్రీనరీని పెంచే విధంగా మొక్కలు నాటుతున్నారు. పచ్చిక బైళ్లను ఏర్పాటు చేస్తున్నారు. నాటి చారిత్రక ఆనవాళ్లను పరిరక్షిస్తూనే..నగిషీలు చెక్కుతున్నారు. నిజాం రాజుల కాలంలో రాతితో నిర్మించిన బండ్‌ను చెక్కు చెదరకుండా కాపాడుతూ.. మరింత పటిష్టం చేస్తున్నారు. చెరువులో కూడా మట్టిలో కలిసిపోయిన నాటి రాళ్లను బయటకు తీసి భద్రపరుస్తున్నారు. ఔట్‌లెట్‌కు మళ్లీ గేట్లు బిగిస్తున్నారు. స్థానిక నివాసితులు అక్కడకు వచ్చి సేద దీరే విధంగా రూపొందించడమే కాకుండా.. సీసీ టీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు.



**చరిత్ర ఎంతో ఘనం..**

చార్ సౌ షహర్ హమారా..435 ఏళ్లకు పైబడిన చరిత్ర ఈ నగరానిది.అడుగడుగునా చారిత్రక ఆనవాళ్లు, ఎన్నో విశేషాలు మన సొంతం. అలాంటి కోవలోకే వస్తుంది..1770లో హైదరాబాదు మూడవ నిజాం సికందర్ జాకు ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్నుఉద్‌దౌలా నిర్మించిన బమ్మృక్నుద్దౌలా చెరువు. ఈ చెరువుకు సంబంధించిన సమాచారం స్థానికంగా ఉన్న వృద్ధులు పలు విధాలుగా వివరిస్తున్నారు. చరిత్ర ఆనవాళ్ల ప్రకారం వంద ఎకరాలకు పైగా ఈ చెరువు విస్తరించి ఉండేదని.. రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ చెరువుకు చేరేదని చెబుతున్నారు. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్మృక్నుద్దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని చెబుతున్నారు. అలాగే బమ్మృక్నుద్దౌలా చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి..ఆ దిగువున నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని తాగేందుకు వినియోగించేవారని మరి కొంతమంది వివరిస్తున్నారు. ఔషధగుణాలున్న ఈ నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారంటున్నారు. అంతే కాదు.. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని.. ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని..ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లేవారంటున్నారు.ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు స్థానికులు సంబరపడుతున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో 51 మంది మావోయిస్టుల లొంగుబాటు




చర్ల, అక్టోబర్ 29 (భారత శక్తి): మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 51 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 9 మంది మహిళా నక్సల్స్ ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరిపై రూ.66 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. వీరందరూ మావోయిస్టు పార్టీ కంపెనీ నంబర్ 1, 2 ,5 సభ్యులని తెలిపారు. మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు.

## అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దు: మంత్రి సీతక్క



హైదరాబాద్, అక్టోబర్ 29 (భారత శక్తి): భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని మంత్రి సీతక్క సూచించారు. తుపాను ప్రభావంపై మహబూబాబాద్, ములుగు, అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిస్థితులు సమీక్షిస్తూ అత్యవసర చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. పలు రైళ్లు నిలిచిపోయినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు.. ప్రభుత్వ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.